జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
న్యూస్ ఈజ్ రైట్
6-2-29/3/12, 3వ అంతస్తు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 4 సంచిక 265 | హైదరాబాద్, జులై 15 గురువారం 2021 | 8 పేజీలు | వెల : 5.00

# ఒక్క ఎకరం కూడా వదలకుండా సాగు: కేసీఆర్

హైదరాబాద్,జులై 14, ప్రజాపాలన ప్రతినిధి:గత ఏడేండ్ల కాలంలో వ్యవసాయ రంగంలో తెలంగాణ సాధించిన ఘన విజయాలను బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో సీఎం కేసీఆర్ మంత్రులతో ప్రస్తావించారు. 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందించడంతో పాటు, అనేక కష్టాలకోర్చి సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంతో నదీ జలాలను చెరువులకు, కుంటలకు, బీడు భూములకు ప్రభుత్వం మళ్లించిందని సీఎం తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో ఒక్క ఎకరం కూడా వదలకుండా, వ్యవసాయానికి అనువుగా ఉన్న భూములను రైతులు సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో పెద్దఎత్తున రాష్ట్రంలో వ్యవసాయ సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన బుధవారం ప్రగతి భవన్‌లో రెండో రోజు జరిగిన కేబినెట్ సమావేశంలో వ్యవసాయ శాఖపై చర్చించారు. ఈ సందర్భంగా గత సంవత్సర కాలంలో వ్యవసాయ రంగంలో జరిగిన పురోగతి, ధాన్యం దిగుబడి, సాగు విస్తీర్ణం పెంపు, తదితర విషయాలను వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి, ఆ శాఖ అధికారులు కేబినెట్‌కు సమగ్రంగా వివరించారు. వానాకాలం సాగు ప్రారంభమైన నేపథ్యంలో, విత్తనాలు ఎరువుల లభ్యత, వర్షాపాతం తదితర అంశాల పై కేబినెట్ చర్చించింది.

3 కోట్ల టన్నుల ధాన్యం ఉత్పత్తి



రాష్ట్రంలోని రైతాంగానికి పంట పెట్టుబడి సాయం రైతు బంధు సహా సకాలంలో ఎరువులు, విత్తనాలను అందిస్తున్నామని సీఎం స్పష్టం చేశారు. వ్యవసాయ, రైతు సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఇలా అన్ని రకాల చర్యల ఫలితంగా గత సంవత్సరం తెలంగాణలో రికార్డు స్థాయిలో 3 కోట్ల టన్నుల ధాన్యం ఉత్పత్తి చేయడం జరిగిందని పేర్కొన్నారు. కరోనా కష్టకాలంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా.. గ్రామాల్లోకి వెళ్లి ప్రభుత్వమే ధాన్యాన్ని కొనుగోలు చేసిందని సీఎం కేసీఆర్ గుర్తు చేశారు.

ధాన్యం ఉత్పత్తి మరింత పెరిగే అవకాశం

ఈ నేపథ్యంలో.. తెలంగాణ రైతులు మరింత ఉత్సాహంతో వరిధాన్యాన్ని పండించే పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయని, వచ్చే సంవత్సరం ధాన్యం ఉత్పత్తి మరింతగా పెరిగే అవకాశాలున్నాయని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా ధాన్యం నిలువ చేయడం, మార్కెటింగ్ చేయడం పై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రస్తుత వానాకాలం కోటీ నలభై లక్షల ఎకరాల్లో వ్యవసాయ సాగు జరగనున్నదని, వరి పత్తి పంటలు రికార్డుస్థాయిలో పండనున్నాయని సీఎం తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో వున్న ధాన్యం నిల్వ సామర్థ్యాన్ని మరింతగా పెంచుకోవాలన్నారు. రైస్ మిల్లులలో మిల్లింగ్ సామర్థ్యాన్ని పెంచుకోవాలని, నూతనంగా రైస్ మిల్లులు, పారబాయిల్డ్ మిల్లులను గణనీయంగా స్థాపించాలన్నారు. ఇందుకు సంబంధించి అత్యంత క్రియాశీలకంగా చర్యలు చేపట్టాలని పరిశ్రమల శాఖను ఆదేశించారు.

రైతులకు సమగ్రంగా శిక్షణ

రైతులకు సమగ్రంగా శిక్షణ ఇవ్వడానికి కావాలసిన అన్ని సౌకర్యాలను వ్యవసాయ శాఖ కల్పించాలని, ఈ ప్రక్రియ నిరంతరంగా కొనసాగాలని సీఎం స్పష్టం చేశారు. ఉద్యానవన శాఖను పూర్తిస్థాయిలో క్రియాశీలకంగా మార్చాలని, అందుకు అవసరమైన రీతిలో అధికారులను, నిపుణులను జోడించి నిరంతరంగా రైతులకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలని సీఎం అధికారులను ఆదేశించారు. పౌర సరఫరాల శాఖ సహా వ్యవసాయ శాఖలో ఎటువంటి ఉద్యోగాలు ఖాళీలు ఉండకూడదని, అన్ని పోస్టులను నింపుకోవాలని కేబినెట్ ఆదేశించింది. పండిన ధాన్యాన్ని పండినట్టే ఫుడ్ ప్రాసెసింగ్ లో భాగంగా మిల్లింగ్ చేసి ఎక్కడ డిమాండ్ ఉంటే అక్కడికి సరఫరా చేయాలని ఆదేశించింది. ఈ దిశగా అన్ని చర్యలు తీసుకోవాలని కేబినెట్ ఆదేశించింది. అందుకు అవసరమైతే సంబంధిత రంగంలో నిపుణుల సలహాలు సూచనలు తీసుకోవాలని కేబినెట్ సూచించింది. నూతనంగా ముందుకు వచ్చే అన్ని రకాల వ్యవసాయ ఉత్పత్తుల పరిశ్రమలను ప్రోత్సహించాలని మంత్రి మండలి అధికారులను ఆదేశించింది.

కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు

రాబోయే రోజుల్లో రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి పెరుగనున్ననేపథ్యంలో.. ధాన్యం నిల్వ, మిల్లింగ్, మార్కెటింగ్ సహా నూతన పరిశ్రమల ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యల గురించి వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని మంత్రి మండలి నిర్ణయించింది. ఈ సబ్ కమిటీలో సభ్యులుగా మంత్రి గంగుల కమలాకర్, హరీశ్ రావు, కేటీఆర్, ఇంద్రకరణ్ రెడ్డి, పువ్వాడ అజయ్ కుమార్, సబితా ఇంద్రారెడ్డి, ప్రశాంత్ రెడ్డి, జగదీశ్ రెడ్డి సభ్యులుగా ఉంటారు.




## ప్రాజెక్టులకు జలకళ

**విస్తారంగా వర్షాలు - నిండుకుండలా జలాశయాలు**

**తడిసి ముద్దైన రాష్ట్రం- రైతుల్లో ఆనందం**

హైదరాబాద్: ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో తెలంగాణలోని పలు ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. ప్రాజెక్టులన్నీ నిండుకుండలా మారడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గోదావరి ఎగువన భారీ వర్షాలు కురవడంతో కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు నీరు వదలడంతో పెద్దపల్లి జిల్లా శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి మట్టం భారీగా పెరిగింది. బుధవారం మధ్యాహ్నం కడెం ప్రాజెక్టు నుంచి ఏడు గేట్లు ఎత్తి నీరు విడుదల చేస్తున్నారు. దీంతో ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు చేరింది. ఈ క్రమంలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు 53, 54 గేట్లను 0.5 మీటర్లు ఎత్తి 5వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యం 20 టీఎంసీలు కాగా, ప్రస్తుతం నీటి నిల్వ 19.36 టీఎంసీలుగా ఉంది. ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద నీటి మట్టాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్టు అధికారులు పేర్కొన్నారు. ప్రాజెక్టు దిగువ గోదావరి పరివాహక ప్రాంతాల రైతులు, ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. నదీ తీరం వద్దకు (మిగతా 2లో..)

## ఈటల రాజేందర్‌ది ఆత్మ వంచన: కేటీఆర్



హైదరాబాద్ : మాజీ మంత్రి ఈటల రాజేందర్ వ్యవహారంపై టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తొలిసారి స్పందించారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ‘ఈటల రాజేందర్‌ది ఆత్మగౌరవం కాదు.. ఆత్మవంచన అని పేర్కొన్నారు. ఈటల తనకు తాను మోసం చేసుకోవడమే కాకుండా ప్రజలను కూడా మోసం చేస్తున్నారు. ఈటలకు టీఆర్ఎస్ పార్టీ ఎంత గౌరవమిచ్చిందో ఆత్మ విమర్శ చేసుకోవాలి. ఆయనకు టీఆర్ఎస్ పార్టీలో జరిగిన అన్యాయం ఏంటో చెప్పాలి. మంత్రిగా ఉండి కేబినెట్ నిర్ణయాలను తప్పుబట్టారు. ఈటల చేసిన తప్పును తానే ఒప్పుకున్నారు. ఈటలపై అనామకుడు లేఖ రాస్తే సీఎం చర్యలు తీసుకోలేదు’ అని కేటీఆర్ తెలిపారు.

**మంత్రిగా ఎందుకు కొనసాగారు?**

ఐదేళ్ల క్రితమే ఆయన ఆత్మగౌరవం దెబ్బతింటే మంత్రిగా ఎందుకు కొనసాగారు? ఐదేళ్ల నుంచి ఈటల అడ్డంగా మాట్లాడినా కేసీఆర్ మంత్రిగా ఉంచారు. ఈటల టీఆర్ఎస్‌లో కొనసాగేలా చివరి వరకు ప్రయత్నించాను. రాజేందర్ టీఆర్ఎస్ పార్టీలోకి రాకముందు కూడా కమలాపూర్‌లో టీఆర్ఎస్ పార్టీ బలంగానే ఉంది అని కేటీఆర్ స్పష్టం చేశారు.

**ఏ ఎన్నికైనా పార్టీల మధ్యనే..**

ఏ ఎన్నికైనా పార్టీల మధ్యే.. వ్యక్తుల మధ్య కాదు అని కేటీఆర్ అన్నారు. హుజురాబాద్‌లో టీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ మధ్యనే పోటీ ఉంటుంది అని స్పష్టం చేశారు. (మిగతా 2లో..)

## హైదరాబాద్‌లో కాల్పుల కలకలం..



హైదరాబాద్ : నగరంలోని గన్‌ఫౌండ్రీలోని ఎస్‌బీఐ కార్యాలయం ఆవరణలో బుధవారం మధ్యాహ్నం కాల్పులు కలకలం సృష్టించాయి. ఒప్పంద ఉద్యోగి సురేందర్‌పై సెక్యూరిటీ గార్డ్ సర్దార్ ఖాన్ రెండు రౌండ్ల కాల్పులు జరిపాడు. పరస్పర వాగ్వాదంతో సెక్యూరిటీ గార్డ్ విచక్షణ కోల్పోయి కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. కాల్పుల్లో గాయపడ్డ ఒప్పంద ఉద్యోగిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాల్పులకు పాల్పడ్డ సెక్యూరిటీ గార్డును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.


"మీరు గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని విశ్వసిస్తే,
మీరు స్వయం సహాయాన్ని నమ్ముతారు, ఇది ఉత్తమ సహాయం"
——డా. బి.ఆర్ అంబేద్కర్



BUSSINESS v/s SOCIAL ENGINEERING
20 సంవత్సరాల స్నేహ గ్రూప్ ప్రయాణం
వ్యాపారమా...? లేక సోషల్ ఇంజనీరింగా...?
మీరే చెప్పండి
BUSSINESS
వ్యాపారం ద్వారా వచ్చే లాభాన్ని పార్ట్నర్స్ గాని డైరెక్టర్ గాని పంచుకోవడాటాన్ని వ్యాపారం (Bussiness) అంటారు
SOCIAL ENGINEERING
సంస్థ నిర్వహించే కార్యకలాపాల ద్వార వచ్చే లాభం మొత్తాన్ని సొసైటీ మార్పు కోసం,పేదల అభివృద్ధి కొరకు,విద్య కొరకు,ఆరోగ్యం కొరకు వాడటాన్ని సోషల్ ఇంజనీరింగ్ అంటారు.
స్నేహ చిట్స్ లో కంపెనీకి వచ్చే లాభాల్ని చారిటీకి వాడుతూ మెంబర్స్‌కు వచ్చే లాభాలను మెంబర్స్‌కు ఇవ్వటం జరుగుతోంది
అంబేద్కర్ టీవీ నిర్మాణం కొరకు స్నేహ మ్యాక్స్ లో డిపాజిట్ చేసిన వారందరికీ వారికి ఇవ్వాల్సిన ఇంట్రెస్ట్ (Interest)ని ఇచ్చి ఆ డిపాజిట్ ని మెంబర్స్‌కి అప్పులు ఇచ్చి,రికవర్ చేసిన తర్వాత వచ్చే లాభాల మొత్తాన్ని అంబేద్కర్ టీవీ ఛానల్‌ను నడపటానికి వినియోగిస్తున్నాం
అంబేద్కర్ టీవీ ఛానల్
సామాజిక దృక్పథంతో బహుజన సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, తద్వారా పరిష్కారమార్గంలోకి తీసుకెళ్లడానికి ప్రయత్నం చేస్తుంది
మహిళలు సాధించిన పురోగతి స్థాయి ద్వారా నేను సమాజ పురోగతిని కొలుస్తాను.
——డా. బి.ఆర్ అంబేద్కర్
జై పూలే జై భీమ్ జై బహుజన జై భారత్

## విద్యార్థులకు వరంగా మారిన మమతాబెనర్జీ పథకం

- **స్టూడెంట్ క్రెడిట్ కార్డులతో ఉన్నత చదువులకు అవకాశం కల్పిస్తున్న బెంగాల్ ప్రభుత్వం**
- **ఈ పథకం మన తెలుగు రాష్ట్రాలలో అమలు పరుస్తే మధ్యతరగతి విద్యార్థులకు వరంగా మారే అవకాశం**



హైదరాబాద్(ప్రజాపాలన) :పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ విద్యార్థినీ విద్యార్థులకు ఒక అద్భుతమైన పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. చదువు కోవాలన్న ఆసక్తి ఉండి చదివే స్థోమత లేని విద్యార్థులకు స్టూడెంట్ క్రెడిట్ కార్డులు ప్రారంభించింది మమత ప్రభుత్వం. ఈ క్రెడిట్ కార్డు ద్వారా ప్రతీ విద్యార్థికి ఉన్నత చదువుల కొరకు పది లక్షల వరకు ఋణం పొందే అవకాశాన్ని మమతా తృణమూల్ ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకానికి అర్హత వయస్సు 40 సంవత్సరాల వరకు పొడిగించడం విశేషం. అయితే ఈ రుణం పొందిన విద్యార్థి చదువు ముగించుకున్న తదుపరి 15 సంవత్సరాలలోపు తమ రుణాన్ని చెల్లించవలసి ఉంటుంది. ఇటువంటి పథకం మన రెండు తెలుగు రాష్ట్రాలలో లేకపోవడం,ఆ దిశగా ప్రభుత్వాలు కనీసం ఆలోచించకపోవడం గమనార్హం. మన తెలుగు రాష్ట్రాలలో మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి విద్యార్థులే అధికం. అటువంటి వారికి ఇలాంటి స్టూడెంట్ క్రెడిట్ కార్డు లాంటి పథకాలు ఎంతో గొప్పగా ఉపయోగపడతాయన్నది నిర్వివాదాంశం. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలలో విద్యార్థులకు కొన్ని పథకాలు అమ్మఒడి,ఫీజు రీయింబర్స్ మెంట్ లాంటి పథకాలు అందుబాటులో ఉన్నా కూడా ఉన్నత చదువుల కొరకు కొంతమందికి మాత్రమే రుణాలు కల్పిస్తున్నాయి.

(మిగతా 3లో..)

# ఎసిబి వలలో ముగ్గురు అధికారులు

## అడ్డంగా దొరికిపోయిన ఇద్దరు ఎస్సైలు

**( తెలంగాణ లోని వివిధ జిల్లాలకు చెందిన ముగ్గురు అధికారులు అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కిన సంఘటన ఉద్యోగ వర్గాల లో కలకలం రేపుతోంది. పోలీసు శాఖపై జూనియర్ న్యాయవాదుల సంఘం నాయకులు అవినీతి ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో ఇద్దరు ఎసైలు లంచం తీసుకుంటూ ఎసిబి వలకు చిక్కడం ప్రాధాన్యత సంతరించుకుంది)**





మంచిర్యాల బ్యూరో, జూలై13, ప్రజాపాలన : ఏసీబీ వలలో మరో అవినీతి అధికారి చిక్కారు. వరంగల్ జిల్లా నెక్కొండ వ్యవసాయ అధికారి అడిదెల సంపత్ రెడ్డి రూ. 10 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికిపోయారు. అప్పల్రావుపేట గ్రామంలోని ఓడీసీఎంఎస్ నిర్వాహకుడు వడ్డె ఏకాంబ్రం వద్ద అధికారి లంచం అడగడంతో ఆయన ఏసీబీని ఆశ్రయించారు. బుధవారం మధ్యాహ్నం ఓడీసీఎంఎస్ నిర్వహకుడి నుండి డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వరంగల్ ఏసీబీ డీఎస్పీ మధుసుదన్ మాట్లాడుతూ.. అప్పల్రావుపేట గ్రామానికి చెందిన వడ్డె ఏకాంబ్రంకు చెందిన ఓడీసీఎంఎస్ షాప్ రెన్యూవల్ కోసం ఎలాంటి తనిఖీలు చెయ్యకుండా ఉండాలంటే డబ్బులు ఇవ్వాలని వేధించాడు. పక్కా సమాచారంతో వ్యవసాయ కార్యాలయంలో అడిదెల సంపత్ రెడ్డికి ఈ బుధవారం మధ్యాహ్నం 2-25 గంటలకు రూ.10 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దీంతో ఆయనపై కేసు నమోదుచేశారు.

**ఏసీబీకి పట్టుబడిన బెల్లంపల్లి టు టౌన్ ఎస్ఐ**

బెల్లంపల్లి టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో నమోదైన ఓ భూమి కేసు విషయంలో స్టేషన్ బెయిల్ ఇవ్వడానికి రెండు లక్షల రూపాయలు డిమాండ్ చేసి లక్ష 20 వేల రూపాయలకు ఒప్పుకొని డ్రైవర్ ద్వారా తీసుకుంటూ బెల్లంపెల్లి టూ టౌన్ ఎస్ఐ భాస్కర్ రావు బుధవారం ఎసిబి కి చిక్కారు. కరీంనగర్ జిల్లా ఆసిఫ్ నగర్ కు చెందిన అల్లె వేణు ఆయన తండ్రి సత్యనారాయణ పై టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో క్రైమ్ నెంబర్ 106/ 119 ,తో కేసు నమోదు కాగా ఆ కేసులో స్టేషన్ బెయిల్ ఇవ్వడానికి సదరు ఎస్ఐ రెండు లక్షల రూపాయలు డిమాండ్ చేయగా లక్షా ఇరవై వేల రూపాయలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. లక్షా ఇరవై వేల రూపాయలను ఇచ్చే క్రమంలో ఎస్ఐ ని కలవగా కారు డ్రైవర్ రాజ్ కుమార్ కి ఇవ్వాల్సిందిగా చెప్పడంతో బుధవారం నాడు ఎస్ ఐ కార్ డ్రైవర్ రాజ్ కుమార్ కు నగదు ఇవ్వగా రాజ్కుమార్ నుండి ఎస్ ఐ తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న ట్లు ఎసిబి డిఎస్పీ బద్రయ్య తెలిపారు. అనంతరం కెమికల్ టెస్ట్ చేయగా పాజిటివ్ గా నిర్ధారణ చేసుకున్న ఎసిబి అధికారులు వారిని అరెస్ట్ గురువారం కరీంనగర్ ఏసీబీ కోర్టు ముందు హాజరు పరుస్తామని తెలిపారు.

**వికారాబాద్‌లో కూడా..**

వికారాబాద్ జిల్లాలో ఓ పోలీసు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబట్టారు. పెద్దేముల్ మండలం పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ దాడుల్లో ఎస్ఐ చంద్రశేఖర్ రూ. 30 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. వివరాల్లోకి వెళితే.. మాంబాపూర్ గ్రామానికి చెందిన ఎంపీటీసీ శ్రీనివాస్‌కు సంబంధించిన రెండు ఇసుక ట్రాక్టర్లను ఎస్సై పట్టుకున్నారు. ఆ ట్రాక్టర్లను కోర్టులో డిపాజిట్ చేసేందుకు గాను రూ. 50 వేల లంచం డిమాండ్ చేశాడు. గత మూడు రోజుల కిందట రూ. 20 వేలు చెల్లించారు. బుధవారం పోలీస్ స్టేషన్‌లో రూ. 30 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు దాడిచేసి.. ఎస్సై చంద్ర శేఖర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

## భారతరత్న అంబేడ్కర్ సంక్షేమ సంఘం జిల్లా నూతన వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉమ్మడి

## రాష్ట్రాల అర్బన్ హెల్త్ సెంటర్స్ రాష్ట్ర అధ్యక్షుడు: పొన్నెకంటి సంజీవ రాజు నియామకం


### అంబేద్కర్ గారి ఆశయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి

### భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దెల శివ కుమార్



కొత్తగూడెం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జులై 14, ప్రజాపాలన ప్రతినిధి:సామాజిక న్యాయం కోసం సమసమాజ స్థాపన కోసం అహర్నిశలు కృషి చేసి తన జీవితాన్ని అంకితం చేసిన త్యాగధనుడు భారత దేశానికి దశ దిశ నిర్దేశం తత్వాన్ని మార్గదర్శకత్వాన్ని చూపించిన మహానుభావుడు అపరిమిత మేధావి అత్యున్నత విద్యావంతుడు గొప్ప రాజనీతిజ్ఞుడు పరిపాలనాదక్షుడు నిమ్నజాతుల జీనస్ భారత రాజ్యాంగ సృష్టికర్త భారత రత్న బాబా సాహెబ్ అంబేద్కర్ గారి స్ఫూర్తితో మద్దెల శివకుమార్ అనబడు నేను అంబేద్కర్ సంఘాన్ని స్థాపించి గత 25 సంవత్సరాలుగా అంబేద్కరిజం ని ముందుకు తీసుకు వెళ్తూ PAY BACK TO THE SOCIETY అన్న బాబా సాహెబ్ పిలుపుకు కట్టుబడి నా జీవితంలో 60 శాతం నా జీవితంలో 60 శాతం సామాజిక అభ్యుదయం కోసం ఖర్చు చేస్తూ అనుక్షణం అంబేద్కరిజం కొరకు తపించే నాకు మంచితనం మానవత్వం కలబోసిన నిరంతర సేవాతత్పరుడు గా అంబేద్కర్ గారి ఆశయాల వారసుడిగానా ప్రియ శిష్యుడు శ్రీ పొన్నెకంటి సంజీవ రాజు ఈ ప్రతిష్ఠాత్మక సంఘంలో పని చేయడానికి ముందుకు రావడం నిజంగా ఎంతో ఆనందదాయకమని రాష్ట్ర అధ్యక్షులు శ్రీ లింగాల రవి కుమార్ గారి ఆదేశాల మేరకు భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం జిల్లా నూతన వర్కింగ్ ప్రెసిడెంట్ గా శ్రీ పొన్నెకంటి సంజీవ రాజును నియమిస్తూ ఉన్నామని హర్ష ధ్వా నాల మధ్య ప్రకటిస్తూ నియామక పత్రాన్ని అందజేసినారు. అనంతరం శ్రీ సంజీవ రాజును పూలమాలలు శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు శుభసూచకంగా స్వీట్లు తినిపించారు. ఆ సందర్భంగా శ్రీ పొన్నెకంటి సంజీవ రాజు స్పందిస్తూ లిభారత రత్న బాబా సాహెబ్ అంబేద్కర్ గారి ఆశయాల సాధన కోసం తన వంతు కృషి చేస్తానని తనపై ఉంచిన నమ్మకాన్ని బాధ్యతను తప్పకుండా నిలబెట్టి సంఘం అభివృద్ధికి సామాజిక చైతన్యానికి పాటుపడతానని తనకు ఈ గొప్ప అవకాశాన్ని ఇచ్చిన అభినవ అంబేద్కర్ మా గురువు శ్రీ మద్దెల శివ కుమార్ గారికి నాలి లికృతజ్ఞతాభివందనాలు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మద్దెల శివ కుమార్ నూతనజిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నెకంటి సంజీవ రాజు జిల్లా ప్రధాన కార్యదర్శి మందా హనుమంతు జిల్లా గౌరవ సలహాదారులు కోలపూడి ధర్మరాజు చంద్రగిరి గోపి చందర్ జిల్లా కోశాధికారి సింగర్ ఆఫ్ సింగరేణి ఆ ల్లి శంకర్ జిల్లా కార్యదర్శి నాగేందర్ బుసి జిల్లా మైనార్టీ నాయకులు మజీద్ సంఘ సభ్యులు లిశ్రీనివాస్ గౌడ్ నాగరాజు భాను తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి పార్టీలో చేరిన బి.వి.సత్యరమేష్



శేరిలింగంపల్లి, ప్రజాపాలన ప్రతినిధి : ప్రముఖ విద్యావేత్త, రిటైర్డ్ సైంటిస్ట్ చందానగర్ డివిజన్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన పద్మావతి భర్త బి. వి. సత్యరమేష్ బిజెపి పార్టీలో బుధవారం చేరారు. బిజెపి రాష్ట్ర నేత కసిరెడ్డి భాస్కరరెడ్డి ఆయనకు బిజెపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కసిరెడ్డి భాస్కరరెడ్డి మాట్లాడుతూ వారి చేరిక వల్ల చందానగర్ డివిజన్ లో పార్టీ బలోపేతం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి చందానగర్ డివిజన్ కాంటెస్టెడ్ కార్పోరేటర్ కసిరెడ్డి సింధూ రఘునాథ్ రెడ్డి, చందానగర్ డివిజన్ అధ్యక్షుడు గొల్లపల్లి రాంరెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గూడూరి త్రినాథ్, కసిరెడ్డి రఘునాథ్ రెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ముదిరాజ్, డివిజన్ యువమోర్చా అధ్యక్షుడు మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిక్ నగర్ బస్తి వాసులకు ఎల్లప్పుడూ మా అండదండలు:

## రాష్ట్ర బిజేపీ నాయకులు ఎం రవి కుమార్ యాదవ్



శేరిలింగంపల్లి, ప్రజాపాలన ప్రతినిధి : సిద్దిక్ నగర్ బస్తి అభివృద్ధి కమిటీ ఎలక్షన్స్ లో నూతనంగా గెలుపొందిన బస్తీ అధ్యక్షుడు బసవరాజు ,అధ్యక్షురాలు లక్ష్మీ బాయి ,జనరల్ సెక్రెటరీ మహేష్ ,కోశాధికారి ఆనంద్ , తదితరులు బుధవారం రవి కుమార్ యాదవ్ నివాసానికి వచ్చి మర్యాదపూర్వకంగా శాలువాతో సన్మానం చేయడం జరిగింది. రాష్ట్ర బిజేపీ నాయకులు మారబోయిన రవి కుమార్ యాదవ్ గెలుపొందిన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేస్తూ, బస్తి అభివృద్ధి కార్యక్రమాల్లో వీరంతా ముందు ఉండాలని కోరుతూ, సిద్దిక్ నగర్ బస్తి కి ఎల్లప్పుడూ మా అండదండలు ఉంటాయని హామీ ఇస్తూ రాబోయే శాసన సభ ఎలక్షన్స్ లో మనమంతా కలిసి పనిచేయాలని వారిని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ చందు, కాలనీవాసులు విక్రమ్ మొదలగువారు ఉన్నారు.

## మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ నివాసంకు విచ్చేసిన బిజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్



శేరిలింగంపల్లి, ప్రజాపాలన ప్రతినిధి : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ మంగళవారం మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్ నివాసానికి విచ్చేశారు. బిజెపి రాష్ట్ర నాయకులు రవికుమార్ యాదవ్, కార్పొరేటర్ గంగాధరరెడ్డి, ఇతర బిజెపి నాయకులతో కలిసి బండి సంజయ్ శేరిలింగంపల్లి గోపన్‌పల్లిలోని భిక్షపతి యాదవ్ నివాసంలో రాత్రి విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భిక్షపతియాదవ్, రవి కుమార్ యాదవ్‌లు బండి సంజయ్‌ను పట్టు బట్టలతో సత్కరించారు. అనంతరం వారు కుటుంబ, రాజకీయ అంశాలపై ముచ్చటించారు. బండి సంజయ్ ఎంతో ఒదిగి ఉండే వ్యక్తి అని, ఆయన నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో బిజెపి బలమైన రాజకీయ శక్తిగా ఎదుగుతుందని రవికుమార్‌యాదవ్ అన్నారు.

## ఈ నెల 15, 16 తేదీలలో జిల్లాలో రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్, సభ్యుల పర్యటన: జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి.శేషాద్రి

మంచిర్యాల బ్యూరో, జూలై 14, ప్రజాపాలన :తెలంగాణ రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్, సభ్యులు ఈ నెల 15, 16 తేదీలలో జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి. శేషాద్రి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15వ తేదీ ఉదయం 10 గంటలకు హాజీపూర్ మండలంలోని ఎఫ్.పి. షాప్ నం.19కు బయలుదేరుతారని, అక్కడి నుండి 10.30 గం?లకు ఎఫ్.పి. షాప్ నం.11, తరువాత 11 గం?లకు ఎఫ్.పి. షాప్ 17ను సందర్శించి, 11.30 గం?లకు దొనబండ, మధ్యాహ్నం 12 గం?లకు ముల్కల్ల, 12.30 గం?లకు సబ్బెపల్లి గ్రామాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించి, 1 గం?లకు నబ్బెపల్లి, 1.30 గం?లకు వెల్మపల్లి లలోని అంగన్వాడీ కేంద్రాలను పరిశీలిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 3 గం?లకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కె.సి.ఆర్. కిట్ పంపిణీ తీరును, సాయంత్రం 4 గం౹౹లకు ఎం.ఎల్.ఎస్. పాయింటు పరిశీలిస్తారని తెలిపారు. ఈ నెల 16వ తేదీ ఉదయం 11 గం? లకు సి.సి.సి. నస్పూర్లోని సింగరేణి అతిథి గృహంలో అధికారులతో జిల్లా స్థాయి సమావేశంలో పాల్గొంటారని తెలిపారు.

## ప్రాజెక్టులకు జలకళ

(మొదటిపేజీ తరువాయి)

ఎవరూ వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. గంటకోసారి సైరన్ మోగిస్తూ మత్స్యకారులను అప్రమత్తం చేస్తున్నారు. కడెం ప్రాజెక్టు గేట్లు మూసివేయడంతో సోమవారం వరద ఇన్ ఫ్లో 7,011 క్యూసెక్కులగా ఉంది. సాయంత్రం అది 15,444 క్యూసెక్కులకు పెరిగింది. ఎల్లంపల్లి దిగువన కాళేశ్వరం ప్రాజెక్టు పార్వతి పంప్ హౌస్ నుంచి గత నెల 18 నుంచి ఈనెల 9 వరకు 30 టీఎంసీల నీటిని ఎల్లంపల్లి జలాశయంలోకి రివర్స్ పంపింగ్ ద్వారా ఎత్తి పోశారు. గత నెల 16 నుంచి ఈనెల 7 వరకు ఎల్లంపల్లి జలాశయం నుంచి నంది, గాయత్రి పంపుహౌజ్‌ల ద్వారా మధ్య మానేరుకు 24 టీఎంసీల నీటిని ఎత్తిపోశారు. ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తుండడంతో గోదావరి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు ఇళ్లలోకి వచ్చి చేరుతుండటంతో ఎత్తిపోతలు నిలిపివేశారు.

**మూసీ నుంచి దిగువకు నీరు విడుదల**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మూసీ నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. హైదరాబాద్‌లో కురుస్తున్న వర్షాలకు తోడు స్థానికంగా కురుస్తున్న వర్షాలకు నల్గొండ జిల్లా కేతపల్లి వద్ద నదిపై నిర్మించిన మూసీ ప్రాజెక్టుకు ఆరు వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో అధికారులు ప్రాజెక్టు 7గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. క్రస్ట్ గేట్లు ఎత్తడంతో దిగువన ఉన్న గ్రామాల ప్రజలు, రైతులు, మత్స్యకారులను అధికారులు అప్రమత్తం చేశారు. బుధవారం రాత్రికి ఇన్‌ఫ్లో పెరిగే అవకాశముందని ప్రాజెక్టు డీఈ చంద్రశేఖర్ తెలిపారు.

## ఈటల రాజేందర్‌ది ఆత్మ వంచన: కేటీఆర్

(మొదటిపేజీ తరువాయి)

**బండి సంజయ్ పాదయాత్ర ఎందుకు?**

బండి సంజయ్ ఎందుకు పాదయాత్ర చేస్తున్నారో చెప్పాలి? ప్రజలకు ఏం అన్యాయం చేశామని పాదయాత్ర చేస్తున్నారు? అని కేటీఆర్ ప్రశ్నించారు. కేంద్రం తెలంగాణకు ఏం ఇచ్చింది? జలజీవన్ మిషన్ కింద అన్ని రాష్ట్రాలకు నిధులు ఇస్తుంది. తెలంగాణకు మాత్రం కేంద్రం నిధులు ఇవ్వడం లేదు అని కేటీఆర్ మండిపడ్డారు.

## పోలీసు శాఖ ప్రత్యేక జోన్ల వివరాలు

-కాళేశ్వరం జోన్లో భూపాలపల్లి జయశంకర్, ఆసిఫాబాద్ కుమ్రంభీం, రామగుండం పోలీసు కమిషనరేట్ రానుంది.

-బాసర జోన్లో

ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్ పోలీసు కమిషనరేట్, జగిత్యాల రానున్నాయి.

-రాజన్న జోన్లో

కరీంనగర్ పోలీసు కమిషనరేట్, సిద్దిపేట పోలీసు కమిషనరేట్, సిరిసిల్ల రాజన్న, కామారెడ్డి, మెదక్ రానున్నాయి.

-భద్రాద్రి జోన్లో

కొత్తగూడెం భద్రాద్రి, ఖమ్మం పోలీసు కమిషనరేట్, మహబూబాబాద్, వరంగల్ పోలీసు కమిషనరేట్ రానున్నాయి.

-యాదాద్రి జోన్లో

సూర్యాపేట, నల్లగొండ, రాచకొండ పోలీసు కమిషనరేట్ రానున్నాయి.

-చార్మినార్ జోన్లో

హైదరాబాద్, సైబరాబాద్ పోలీసు కమిషనరేట్, సంగారెడ్డి రానున్నాయి.

-జోగులాంబ జోన్లో

మహబూబ్నగర్, వనపర్తి, గద్వాల్ జోగులాంబ, నాగర్కర్నూల్, వికారాబాద్ రానున్నాయి.

## తెలంగాణా లో మూడవ దశ ఉద్యమం రాబోతుందా !!!

**మార్త సత్యనారాయణ,1969 ఉద్యమ నాయకుడు**

ఉద్యమాలు చేసి తెలంగాణా సాదించినా సామాజిక తెలంగాణా సాధించలేకపోయామని,ఆశించిన స్థాయిలో ప్రజలు ఫలితాలు అందుకోలేక పోయారని, ఉద్యమ కారులు,అన్ని పార్టీల నాయకులు,ప్రజలు ఏడు సంవత్సరాల నిరీక్షణ తర్వాత " తెలంగాణా ఉద్యమ ఆకాంక్షల వేదిక " పేరిట ఈనెల 9 నా హైదరాబాద్ లకిడికాపూల్ లో ఊహించిన దానికంటే ఎక్కువ విజయవంతం కావడం , వెంటనే ఈనెల 19 న హన్మకొండ లో సభ ఏర్పాటు చేయడంతో మూడవ దశ ఉద్యమం పై ఆశలు చిగురించుచున్న సంకేతాలు కనిపిస్తున్నాయని ,రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొంటుందా !!అన్నట్లు ఉందని మార్త సత్యనారాయణ , ఉద్యమ కారులు గారు అన్నారు . సీనియర్ పాత్రికేయులుపాశం యాదగిరి,గాదె ఇన్నయ్యచెరుకు సుధాకర్, పొన్నం, సంధ్య,అరుణ,మల్లు రవి, ప్రొఫెసర్ ననుమాస స్వామి, మాజీ మంత్రి విజయ రామారావు,మేచినేని కిషన్ రావు, అనేక మంది జర్నలిస్టులు పాల్గొనబొతున్నారన్నారు.... ఈమేరకు 19 న నాటి పోస్టర్లు నాయకులు విడుదల చేశారు...

## బాధితులకు వాసవి ఫౌండేషన్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆర్థిక సహాయం

శేరిలింగంపల్లి, ప్రజాపాలన ప్రతినిధి : కరోనా మహమ్మారి కారణంగా ఇటీవలి కాలంలో ఎన్నో కుటుంబాలు జీవనోపాధిని కోల్పోయి, వారి ఆదాయవనరులు దెబ్బతినడంతో కుటుంబాన్ని పోషించుకోవడానికి అనేక కష్టనష్టాలకు గురై ఇబ్బందులు పడుతుండడాన్ని గమనించి. బాధితులకు వాసవి ఫౌండేషన్ ఫర్ ఎంపవర్‌మెంట్ ద్వారా జులై 14న ఈ సంస్థ డైరెక్టర్ గజ్జల యోగానంద్ చెక్ రూపేణా ఆర్థిక సహాయం అందేలా చేయుతనిచ్చారు. నేడు జరిగిన ఈ వితరణ, గతంలో అందించిన సహకారంతో కలిపి మొత్తం 200 కుటుంబాలకు ఆర్థిక సాయం అందిందని తెలియజేయడానికి సంతోషిస్తున్నాము. ఈ సందర్భంగా యోగానంద్ తమ సందేశాన్ని అందిస్తూ ఈ కుటుంబాలు ఆర్థికంగా నిలబడేందుకు వరుసగా 3 నెలల పాటు ఈ సహాయం అందజేస్తామని తెలియజేశారు. మనోబలంతో కోవిడ్ కష్టాలను అధిగమించవచ్చని, జీవితంలో ఒడిదుడుకులు సహజమని తెలియజేస్తూ ధైర్యంతో ముందుకు సాగాలని హితవు చెప్పారు. బాధితులకు భవిష్యత్తులో కూడా అవసరమైన మేరకు తగిన సహాయసహకారాలను అందిస్తామని హామీ ఇచ్చారు. జి.వై ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కూడా అయిన శ్రీ యోగానంద్ గారు కరోనా బాధితులకు తమ ఫౌండేషన్ ద్వారా కావలసిన సహాయ సహకారాలు అందించడం, హైడ్రోక్లోరిట్ పిచికారీ కోసం వాహనం ఏర్పాటుచేయడం, మందులు, ఆహార పొట్లాల సరఫరా చేయడం ఎంతో తృప్తిని ఇచ్చిందని, ఈ క్లిష్ట సమయంలో ప్రజలకు అండగా నిలవడం సామాజిక భాధ్యతగా భావిస్తున్నానని తెలియజేశారు. సామాజిక సేవను తమ కర్తవ్యంగా భావించి కోవిడ్ బాధితులకు యోగానంద్ అందజేసిన ఈ సహాయ సహకారాల గురించి మీ మీడియా ద్వారా ప్రజలకు తెలియజేసి, ఈ స్ఫూర్తిని మరిందరిలో నింపేందుకు సహకరించవలసిందిగా కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాజు శెట్టి, గాదె గోపాల్, మారం వెంకట్,స్వాతి , సత్య, రాములు, వీరేష్, రమేష్ సోమిశెట్టి, పాల్గొన్నారు.

# చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

## రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ సభ్యులు అరికెళ్ళ దేవయ్య



మంచిర్యాల బ్యూరో,జూలై 14, ప్రజాపాలన :ప్రస్తుత కరోనా విపత్కర పరిస్థితుల దృష్ట్యా చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ సభ్యులు అరికెళ్ళ దేవయ్య అన్నారు. బుధవారం జిల్లాలోని సి.సి.సి. నస్పూర్లో సింగరేణి అతిథి గృహంలో కరోనా 3వ వేవ్పై ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమావేశంలో జిల్లా కలెక్టర్ భారతి హోళికేరితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కమీషన్ సభ్యులు మాట్లాడుతూ మొదటి, రెండు కరోనా వేవ్లలో పిల్లలపై ఎలాంటి ప్రభావం చూపించలేదని, కాని పిల్లల ఆరోగ్యంలో ఏమైనా మార్పులు కనబడితే తల్లిదండ్రులు మనోధైర్యంతో ఉంటూ ప్రభుత్వ సూచనల మేరకు తగిన జాగ్రత్తలు పాటిస్తూ రక్షించుకోవాలని చూసించారు. తల్లిదండ్రులు లేని పిల్లలకు స్త్రీ, శిశు సంక్షేమశాఖ, బాలల పరిరక్షణ కమీషన్ ఆధ్వర్యంలో అన్ని వసతులు కల్పించడం జరుగుతుందని తెలిపారు. సంక్షేమశాఖ ద్వారా కరోనా సమయంలో పిల్లలకు కావలసిన సహకారం అందించడం జరుగుతుందని తెలిపారు. కరోనా వైరస్ నియంత్రణ నేపథ్యంలో పాఠశాలలు, కళాశాలలు లేకపోవడం వలన పిల్లలు లైంగిక వేధింపుల గురవుతున్నారని, బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతు న్నాయని, వాటిని అరికట్టవలసిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై వారి తల్లిదండ్రులతో చర్చించి అందించ వలసిన పౌష్టికా హారంతో పాటు తీసుకోవలసిన జాగ్రత్తలపై తగు సూచనలు చేయాలని తెలిపారు. బాలల హక్కులను ఎవరైనా కాలరాస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని, కరోనా 3వ వేవ్ ప్రభావం పిల్లలపై పడకుండా ఉండేందుకు తీసుకోవలసిన చర్యలపై తగు సూచనలు, సలహాలు చేస్తూ సంబంధిత అంశాలను పవర్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. కరోనా 3వ వేవ్ స్థితిని అందరు కలిసికట్టుగా ఎదుర్కోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సి.డబ్ల్యు.సి. మంచిర్యాల, నిర్మల్ జిల్లాల చైర్మన్ వాహిద్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి సుబ్బారాయుడు, జిల్లా స్త్రీ, శిశు, వయోవృద్ధుల, దివ్యాంగుల సంక్షేమశాఖ అధికారి ఉమాదేవి, వైద్యాధికారులు, సి.డి.పి.ఓ.లు, సూపర్వైజర్లు, సంబంధిత శాఖల అధికారులు, పాల్గొన్నారు.



## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి:

### సిఐటియు జిల్లా అధ్యక్షులు అల్లూరి లోకేష్

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూలై 13, ప్రజాపాలన : జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్ డిమాండ్ చేశారు. కార్మికుల పెండింగ్లో ఉన్న సమస్యలపై మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం లోని డిఆర్ఓ కదం సురేష్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పిఆర్సి మధ్యాహ్న భోజన కార్మికులకు వర్తింపజేయాలని, జీవో నెంబర్ 60 ప్రకారంగా కనీస వేతనం రూ 19,500, చెల్లించాలన్నారు. కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఎం డి ఎం యూనియన్ జిల్లా అధ్యక్షుడు పగిడి మాయ, కార్మికులు పద్మ, విజయ, లక్ష్మి, ఈశ్వరి, పోషక, తదితరులు ఉన్నారు.

## రసమయి బాలకిషన్ నియామకం పట్ల కళాకారులు హర్షం



మంచిర్యాల బ్యూరో,జూలై 14,ప్రజాపాలన :తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో తెలంగాణ ధూం ధాం పేరుతో ఉవ్వెత్తున ఎగిసి ప్రజల్లో స్వరాష్ట్ర సాధనపై చైతన్యం తీసుకువచ్చిన తెలంగాణ సాంస్కృతిక సారథి సంస్థ చైర్మన్ గా కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గ శాసనస భ్యులు రసమయి బాలకిషన్ మూడవ సారి నియామకం కావడం పట్ల జిల్లాలోని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులుబుధవారం హర్షం వ్యక్తం చేస్తూ స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా టి.ఎస్.ఎస్. టీం లీడర్ కుమ్మరి శ్రావణ్ కుమార్ సీనియర్ కళాకారులు మామిండ్ల లచ్చన్న, ముల్కల్ల మురళి, వెల్తూరి పోచంతో కలిసి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో 14 సంవత్సరాల పాటు ప్రాణాలను ఫణంగా పెట్టి తెలంగాణ ధూం ధాం పేరుతో ఎన్నో కళా ప్రదర్శనలు నిర్వహించి తెలంగాణ ప్రజల ఆకాంక్షను, ఉద్యమ సెగను దేశ రాజధాని ఢిల్లీ వరకు చాటారని తెలిపారు. ఆయన మూడవ సారి ఆయనను చైర్మన్ గా నియమించినం దుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్రావుకు కృతజ్ఞతలు తెలిపారు. రసమయి నియామకం పట్ల ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాకారులు కొప్పర్తి రవీందర్, నల్లూరి కృష్ణ, మిట్టపెల్లి సంధ్య, పొడుగు యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## భూములకు ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టాలు ఇవ్వాలి

### డిఎఫ్ఓ శాంతారాం, ఎస్పి సుధీంద్ర లకు గ్రామస్తుల వినతి




ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూలై 14, ప్రజాపాలన : తాము ఎన్నో సంవత్సరాల నుండి చేస్తున్న పోడు భూములకు ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టాలు అందించాలని ఆసిఫాబాద్ రేంజ్ పరిధిలోని తిర్యాని మండలం దంతన్ పెల్లి గ్రామస్తులు బుధవారం డిఎఫ్ఓ శాంతారాం, ఎస్పీ వైవిఎస్ సుదీంద్ర, కు తిర్యాని ఎస్సై రామారావు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ప్రాంతంలో డోర్లి ఓపెన్ కాస్ట్ అయిన తర్వాత పూర్తి భూములు కోల్పోయామని అన్నారు. అప్పటి నుండి భూములు పోడు సాగు చేసుకుంటూ జీవిస్తున్నామని కొలాం జాతికి చెందిన తమను సాగు చేసుకోకుండా ప్రస్తుత సంవత్సరం అటవీశాఖ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత సంవత్సరం ఇప్పటికే వేలాది రూపాయలు వెచ్చించి పత్తి గింజలు వేశామని, దీని పైన ఆధారపడి జీవిస్తున్న తమకు భూములు కోల్పోతే జీవించడం భారం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పివిటిజి జాతులకు చెందిన తమను భూమి సాగు చేయకుండా ఆపడం దారుణమన్నారు. అదే విషయం ఇప్పటికే ఐటిడిఎ పిఓ దృష్టికి తీసుకు వెళ్లామని అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అయితే జిల్లాకు చెందిన అటవీ అధికారులు మాత్రం పూర్తిగా మా భూములు గుంజుకొనే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. వచ్చే సంవత్సరం భూములు వదిలిపెడతామని హామీ పత్రం రాసి ఇవ్వాలని అటవీ అధికారులు అడుగుతున్నారని, తమకు ఏ ఆధారం లేకుండా ఎలా చేస్తామని ప్రశ్నించారు. పోడు సాగుచేస్తున్న భూముల లో ఉన్న లబ్ధిదారులకు ఎవరికి కూడా పెద్ద మొత్తంలో భూములు లేవని, కనీసం దీని నైనా పరిగణలోకి తీసుకొని అటవీ అధికారులు జోక్యం చేసుకోకుండా ఉండాలని కోరారు. అంతకుముందు ఆసిఫాబాద్ రేంజ్ అధికారి అప్పలకొండ, డిప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్ కుమార్, బీట్ అధికారిని స్వప్న, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. బుధవారం జిల్లా అటవీశాఖ అధికారి, జిల్లా ఎస్పీని కలిసిన వారిలో గ్రామ పెద్దలు గంగారాం, లక్ష్మణ్,పావుగా,భీమ్‌రావులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వరంగా మారిన మమతాబెనర్జీ పథకం

(మొదటి పేజీ తరువాయి)

అలాంటిది ఇలా స్టూడెంట్ క్రెడిట్ కార్డులు లాంటి గొప్ప పథకాన్ని మన రాష్ట్రాలలో అమలు పరుస్తే ఎంతో మంది విద్యార్థులు ఉన్నత చదువులు చదివే అవకాశం కల్పించిన వారవుతారని ప్రజానీకం



# ప్రజాపాలన

**సంపాదకీయం**

**గురువారం 15, జులై 2021**

# కమాండర్ ఇన్ చీఫ్ మోదీ!

వాతావరణం ప్రతికూలంగా కనిపిస్తున్నప్పుడు, తన నాయకత్వ సామర్థ్యంపై పార్టీలోనూ, బయటా రణగొణ ధ్వనులు వినిపిస్తున్నప్పుడు, తన గ్రాఫ్ పడిపోతున్నదా అని తనకే అనుమానాలు వచ్చినప్పుడు, తన చర్యలు దేశంలోనూ, విదేశాల్లోనూ ప్రశ్నార్థకం అవుతున్నప్పుడు నాయకుడు అనేవాడు ఉన్నట్లుండి తాను ఆడుతున్న శైలి మార్చి అందరి దృష్టినీ తన వైపుకు తిప్పుకుని, క్రమంగా పరిస్థితులను తనకు అనుకూలం చేసుకుని, పట్టు బిగించే ప్రయత్నాలు చేయడం చాలా సహజం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇప్పుడు అవే ప్రయత్నాలు ప్రారంభించారు. కరోనా మహమ్మారి రెండో ప్రభంజనం సృష్టించిన కల్లోలంలో ప్రభుత్వ వైఫల్యం గురించి అంతటా ప్రశ్నలు లేవనెత్తుతున్నప్పుడు, బెంగాల్ ఎన్నికల్లో అనుకున్నట్లుగా విజయం సాధించలేకపోయినప్పుడు, ఆర్థిక వ్యవస్థ గాడి తప్పినప్పుడు మోదీ కొత్త ఎత్తుగడలు వేసే ప్రయత్నాలు చేశారు. కాకపోతే 2019 ఎన్నికలకు కొద్ది రోజుల ముందు ఆయన పావులు కదపాల్సి వస్తే, ఇప్పుడు రెండేళ్లు ముందుగానే ఆయన తన దిశను మార్చుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు కనిపిస్తున్నారు. సుప్రీంకోర్టు, రాష్ట్ర ప్రభుత్వాల విమర్శల నేపథ్యంలో కరోనా వాక్సిన్ విధానాన్ని మార్చుకోవడం, మరో ఆర్థిక ప్యాకేజీ ప్రకటించడం, జమ్ము, కశ్మీర్‌లో రాజకీయ ప్రక్రియ ప్రారంభించడం, ఇప్పుడు తాజాగా మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరపడం మోదీ చేపట్టిన కీలక చర్యల్లో కొన్ని. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపట్టడం అనేది ఏ నాయకుడికైనా ఒక రాజకీయ అవసరం. కనీస ప్రభుత్వం- గరిష్ఠ పాలన అన్నది ఆచరణ సాధ్యం కాదు అని గ్రహించినందువల్లే మోదీ 78 మందితో తన మంత్రివర్గాన్ని విస్తరించారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపట్టే ముందు ఆయన పార్టీ అగ్రనేతలతో సుదీర్ఘ చర్చలు నిర్వహించారు. ఎంపీలతో మాట్లాడారు. మంత్రివర్గ పూర్తి స్థాయి సమావేశాలను రెండు సార్లు నిర్వహించారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంపై తన నియంత్రణను బలోపేతం చేసే చర్యలు తీసుకున్నారు. ఇవన్నీ చేసిన తర్వాతే ఆయన తన ఇష్టం వచ్చిన వారిని ఇష్టం వచ్చిన శాఖల్లో నియమించారు. ఇది పూర్తిగా మోదీ బ్రాండ్ ఉన్న మంత్రివర్గం. గతంలో నరసింహారావు, మన్మోహన్ సింగ్, వాజపేయి లాంటి వారు మంత్రివర్గంలో మార్పులు చేపడితే ఎవరెవరు మంత్రివర్గంలో ఉంటారో ఊహించడం చాలా సులభంగా ఉండేది. అయితే ఈ మార్పులు చేసే క్రమంలో సీనియర్ నాయకులైన ప్రకాశ్ జవదేకర్, రవిశంకర్ ప్రసాద్‌లు ఇద్దర్నీ ఎందుకు తొలగించారు? నిజానికి వారు పార్టీ తరఫున, ప్రభుత్వం తరఫున బలంగా మాట్లాడుతున్నవారు. ఏళ్ల తరబడి మీడియాలో కనపడుతున్నందువల్ల వారు చెప్పేదానికి ప్రాధాన్యత కూడా లభించేది. వారు తమ మంత్రిత్వశాఖల్ని సరిగా నిర్వహించలేదనుకుంటే, వారిని ఇతర మంత్రిత్వశాఖలకు మార్చవచ్చు. వారికి పార్టీలో కీలక బాధ్యతలు అప్పజెప్పాలనుకుంటే ఆ విషయం ముందే వారికి చెప్పి, బహుళ ప్రాచుర్యం ఇచ్చిన తర్వాత ఆ పనిచేసి ఉండవచ్చు కాని మంత్రివర్గ ప్రమాణస్వీకారానికి గంట ముందే వారికి ఆ విషయం చెప్పి హతాశులను చేసి, అవమానపరచాల్సిన అవసరం ఏమిటి? వాజపేయి, ఆడ్వాణీలకు చెందిన గతానికి అవశేషాలుగా ఉన్న ఆ ఇరువురినీ తొలగించడం ద్వారా మోదీ తన ప్రత్యేకత, విశిష్టత నిరూపించుకోవాలనే ఆ విధంగా చేశారు. మోదీ తన టీమ్‌ను నిర్ణయించుకున్న తీరు అధ్యక్ష పాలనా వ్యవస్థను సూచిస్తున్నదనడంలో సందేహం లేదు. కరోనా మహమ్మారి రెండో ప్రభంజనం వైఫల్యానికి డాక్టర్ హర్షవర్ధన్‌ను బలి చేయడం కూడా ఒక ఆశ్చర్యకరమైన విషయం. నిజానికి కరోనా ప్రారంభమైనప్పటి నుంచీ మోదీయే ఆరోగ్య శాఖను పూర్తిగా తన అధీనంలోకి తీసుకున్నారు. నీతీ ఆయోగ్‌ను రంగంలో దించారు. టాస్క్‌ఫోర్స్‌లను ఏర్పాటు చేశారు. అనేకసార్లు అధికారుల సమావేశాలను ఏర్పాటు చేశారు. కరోనా వైఫల్యానికి హర్షవర్ధన్ కారణమైతే అందుకు బాధ్యత ప్రధానమంత్రి కూడా వహించాల్సి ఉంటుంది. అసలు వైఫల్యమే కొలమానమైతే ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం కావడానికి ఎవర్ని బాధ్యులు చేయాలి? ఉత్తరప్రదేశ్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఓబీసీలను, దళితుల్లో ఉపకులాలను తమవైపుకు తిప్పుకునే ఉద్దేశంతో మంత్రివర్గంలో ఈ వర్గాలకు చెందిన అత్యధికులకు అవకాశాలు కల్పించేందుకే ప్రధానంగా ఈ విస్తరణ జరిగిందనడంలో అతిశయోక్తి లేదు. కాని 'సబ్ కా సాథ్- సబ్ కా విశ్వాస్' అన్న నినాదాన్ని చేపట్టిన ప్రధానమంత్రి మంత్రివర్గంలో 2014 నుంచి ఒకే ఒక్క ముస్లిం మంత్రి, అది కూడా పెద్దగా ప్రాముఖ్యత లేని శాఖలో ఉన్నారు. కులాలకు, ఉపకులాలకు అంత ప్రాధాన్యత నిచ్చేవారు దేశంలో 14 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 19 శాతానికి పైగా ఉన్న ముస్లింలకు మంత్రివర్గంలో ప్రాధాన్యత ఎందుకు ఇవ్వలేదని బిజెపి ప్రభుత్వాన్ని అడగడంలో అర్థం లేదు. దాని గురించి వారు చర్చించడానికి కూడా ఇష్టపడరు. బిజెపిలో ప్రతిభ కొరత స్పష్టంగా కనపడుతున్నదనడానికి ఈ పునర్వ్యవస్థీకరణే నిదర్శనం. సివిల్ సర్వీస్‌కు చెందిన వారు ఏడుగురు మంత్రివర్గంలో ఉండడానికి కారణం ఏమిటి? పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖను నిర్వహిస్తున్న హర్దీప్ సింగ్ పురికి అది చాలదన్నట్లు పెట్రోలియం, సహజ వాయు మంత్రిత్వశాఖను కూడా అప్పగించారు. రాజకీయ అనుభవం ఏ మాత్రం లేని మాజీ ఐఎఎస్ అధికారి, తర్వాత కొన్ని కంపెనీల్లో సిఇఓగా పనిచేసి, గుజరాత్‌లో ఆటోమోటివ్ ఉత్పాదక యూనిట్లని పెట్టి వ్యాపారం చేసిన అశ్వినీ వైష్ణవ్‌కు ఐటీ, కమ్యూనికేషన్ల మంత్రిత్వశాఖతో పాటు అత్యంత కీలకమైన రైల్వే మంత్రిత్వశాఖను అప్పగించాల్సిన అవసరం ఏమిటి? ఈ రెండు మంత్రిత్వశాఖల్లో కార్పొరేటీకరణ గతంలో వేగంగా జరగలేదని ఏమైనా భావించారా? ఉన్న మంత్రుల్లో సమర్థంగా పనిచేస్తున్న సీనియర్ నేత, బిజెపి మాజీ జాతీయ అధ్యక్షుడు నితిన్ గడ్కరి నుంచి చిన్న, సూక్ష్మ, మధ్యతరహా సంస్థల మంత్రిత్వశాఖను తొలగించి కేవలం రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖనే మిగిల్చారు. గతంలో కూడా ఆయన నుంచి షిప్పింగ్, జల వనరులు, నదీజలాల అభివృద్ధి, గంగా ప్రక్షాళన మంత్రిత్వశాఖలను తీసేసుకున్నారు. ఒక సీనియర్ మంత్రి కంటే ఒక ఐఏఎస్ అధికారి ఒకటి కంటే రెండు మంత్రిత్వశాఖల్ని నిర్వహించగలరని మోదీ భావించారా? ఆరోగ్యంలో ఆయుష్, యోగా కూడా భాగమని, వాటిని సమగ్ర దృక్పథంతో అభివృద్ధి చేయాలని ఇంతకాలం చెబుతూ, ఇప్పుడు ఆరోగ్య శాఖనుంచి ఆయుష్‌ను, యోగాను తీసేసి అస్సాం మాజీ ముఖ్యమంత్రి సర్బానంద సోనోవాల్‌కు అప్పగించడంలో ఆంతర్యం ఏమిటి? దేశంలో అత్యంత కీలకమైన, ప్రాముఖ్యత గల హోంమంత్రిత్వశాఖను నిర్వహిస్తున్న అమిత్ షాకు సహకార మంత్రిత్వశాఖ అనే కొత్త శాఖను సృష్టించి కేటాయించడంలో అసలు ఉద్దేశం ఏమిటి? సహకారం అనేది రాష్ట్రాలకు సంబంధించిన అంశం. గుజరాత్‌లో సహకార సంఘాలపై పట్టు సాధించడం ద్వారానే మోదీ హయాంలో బిజెపి రాష్ట్రంపై పట్టు బిగించింది. గ్రామీణ భారతంలోనూ అసంఘటిత ఆర్థిక వ్యవస్థలోనూ కీలక పాత్ర పోషిస్తున్న సహకార రంగాన్ని తన హస్తగతం చేసుకుని తమ పట్టును బలోపేతం చేసేందుకే ఈ శాఖను సృష్టించి అమిత్ షాకు అప్పగించారా? ప్రధానంగా మహారాష్ట్రలో సహకారసంఘాలపై పట్టు ఉన్న ఎన్ సిపి-కాంగ్రెస్ పునాదిని దెబ్బతీయడమే ఉద్దేశమా? సాగు చట్టాలపై వ్యతిరేకత వ్యక్తం చేస్తున్న రైతులను సహకార మార్గంలో మచ్చిక చేయాలనుకుంటున్నారా? పెద్ద నోట్ల రద్దు సమయంలో నగదు మార్పిడిలో కీలక పాత్ర పోషించిన పట్టణ, గ్రామీణ సహకార బ్యాంకులపై నియంత్రణ పొందాలనుకుంటున్నారా అన్న రకరకాల అనుమానాలు కలుగుతున్నాయి. ఏమైనప్పటికీ పార్టీ, ప్రభుత్వంపై తన పట్టును పూర్తిగా బిగించేందుకే మోదీ ఈ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపట్టారనడంలో సందేహం లేదు. మంత్రివర్గ ప్రమాణ స్వీకారానికి ముందే కాబోయే మంత్రులను పిలిపించి వెంటనే బాధ్యతలు స్వీకరించి, తమ తమ శాఖలను సమీక్షించి వాటిపై పట్టు సాధించాలని ఆదేశాలు జారీ చేశారు. మంత్రులను ఆదేశించిన మరునాడే బిజెపి జాతీయ కార్యాలయంలో ఆఫీసు బేరర్లందర్నీ తన కార్యాలయానికి పిలిచి దాదాపు అయిదుగంటల పాటు వారి పనితీరును సమీక్షించారు.

కేంద్రంలో ఇప్పుడు ఉన్నది ఒకే ఒక్క అధికార కేంద్రం. అది నరేంద్రమోదీ మాత్రమే. ప్రధానమంత్రీ ఆయనే, పార్టీ జాతీయ అధ్యక్షుడూ ఆయనే. జగత్ ప్రకాశ్ నడ్డా పేరుకు మాత్రమే పార్టీ అధ్యక్షుడు. కేంద్రమంత్రివర్గ పునర్వ్యస్థీకరణతో నరేంద్రమోదీ పార్టీకి, ప్రభుత్వానికి కమాండర్ ఇన్ చీఫ్ అన్న విషయం అర్థమైంది. పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ రణగొణ ధ్వనులు కానీ, లైన్ దాటడం కానీ జరిగేందుకు అవకాశం లేదు. రెండింటినీ నియంత్రించడం సాధ్యం కావచ్చు కానీ ప్రజల మనస్సులను ఆకట్టుకోవడం అంత సులభం కాదు. అది జరిగేంతవరకూ ఎంత కేంద్రీకృత అధికారం అనుభవించినా, ఒరిగేదేమీ లేదు.

## పిల్లలు.. నా పిల్లలు..

పిల్లలు పుట్టారు.
పూజ్య పూర్వీకుల వృక్షం నుంచి
వాళ్ల పేర్లను బట్టి
పొత్తిళ్లలోకి తీసుకున్నారు
రూపొందిన కార్యక్రమాల నుంచి
వేచి చూస్తున్న భవిష్యత్ నుంచి
ఎదురుచూపుల మంటల మీద
ఉడికించిన దాల్చిన చెక్క వాసన నుంచి
వాళ్లను స్వీకరించారు.
పుట్టినరోజుల వేడుకల నుంచి
విందుల నుంచి, నూతన వస్త్రాల నుంచి
వాళ్లను గ్రహించారు.

నా పిల్లలు పుట్టారు.
ప్రేమ నిండిన కన్నీళ్లతో
భయంతో వణుకుతూ వాళ్లను స్వీకరించాం

వాళ్ల కోసం ఎదురుచూస్తూ
ప్రసూతి ఆసుపత్రి గేట్ల దగ్గర
పిచ్చికుక్కల కళ్లు..
వాళ్ల కోసం ఎదురుచూస్తూ
పోలీసు దళాలు..
వాళ్ల కోసం ఎదురుచూస్తూ
వేచి వున్న మృత్యువు..
దేహ పరిసమాప్తి కార్యక్రమాలు..

నా పిల్లలు పుట్టారు..
వాళ్లతో పాటుగా
ఉత్సవాల్లో మిరుమిట్లు గొలిపే
బాణాసంచా వెలుగుల్లా పేలే
తెల్ల భాస్వరం బాంబులూ పుట్టాయి

నా పిల్లలు పుట్టారు..
వాళ్లతో పాటుగా
వాళ్ల చిన్ని శవపేటికలూ

..వా

# ప్రశ్నే అతని ఆయుధం



పులుల బోనులాంటి ఆధిపత్యాల సమాజం మనది. ఇందులో బలహీనులు, బ్యాక్‌గ్రౌండ్ లేనివారు రాణించాలంటే ఎంతో యుద్ధం చేయాలి. అలా చేస్తే తప్ప, తమ కలలు సాకారం కావడం సాధ్యం కాదు. అట్లా ఆధిపత్యాలకు పెట్టని కోటలుగా ఉన్న సినీ, రాజకీయరంగాల్లో అనతికాలంలో తనదైన స్థానాన్ని సొంతం చేసుకున్న అలుపెరుగని పోరాటకారుడు కత్తి మహేష్. ఆయన అకాల మరణం తెలుగు సమాజానికి తీరని లోటు. అటు సినీరంగంతో పాటు, ఇటు సామాజికరంగంలో కూడా ఆయన లేని లోటు పూడ్చలేనిదంటే అతిశయోక్తి కాదు. కత్తి మహేష్ పేరు వింటే ఆయన మిత్రుల మనసులు ఎంతగా పులకరిస్తాయో అతని శత్రువుల గుండెలు సైతం అంతే రగిలిపోతాయి. అందుకు కారణం అతని నిబద్ధత, నిజాయితీతో పాటు నిత్యం బాధిత సమూహాల పక్షాన గొంతెత్తడం అతని ప్రవృత్తిగా మారడమే. మహేష్‌ను దగ్గరగా చూసిన వారికి అతనిలోని తెగింపు, మడమ తిప్పనితనం విపరీతంగా నచ్చుతాయి. తాను అనుకున్న లైన్ ఎట్లా సరైందో విడమరచి చెప్పేవాడు. అవతలి వారి ఆలోచనలోని తప్పుడు ధోరణుల్ని ఎప్పటికప్పుడు ఎండగట్టేవాడు. ఈ నిఖార్సయిన తిరుగుబాటుతనమే తనకు మిత్రులతో పాటు శత్రువులను కూడా సంపాదించి పెట్టింది. అతని శత్రువులకు కత్తిలోని స్నేహశీలి, పోరాటాల తిరుగుబాటుదారుడు అంతగా తెలిసే అవకాశం లేదు. అంతే కాదు, కత్తి బహుముఖ ప్రజ్ఞాశాలి. సినీ క్రిటిక్‌గా, దర్శకునిగా, నటునిగా, వ్యాఖ్యాతగా, సామాజిక ఉద్యమకారునిగా, ఔత్సాహిక రాజకీయవేత్తగా ఆయన చేసిన కృషి అసామాన్యమైనది. కేవలం నాలుగున్నర పదుల వయసులోనే ఇన్ని రకాలైన పనులు చేయడం బహుశా కత్తికే సాధ్యమైంది. అది ఆయన జీవన నేపథ్యం నేర్పిన పాఠమైంది. చిత్తూరు జిల్లా తిరుపతి సమీపంలోని పీలేరు అనే ఒక చిన్న గ్రామం నుండి కత్తి ప్రస్థానం మొదలైంది. చిన్ననాటి నుంచి చదువులో ముందుండే కత్తి, తన భవిష్యత్తును చదువులోనే చూసుకున్నాడు. అట్లా ప్రతిష్ఠాత్మకమైన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చేరుకున్నాడు. అక్కడ మాస్ కమ్యూనికేషన్స్ కోర్సులో చేరి తన ఆలోచనా ప్రపంచాన్ని మరింత విశాలం చేసుకున్నాడు. సినిమాల పట్ల తనకున్న అభిలాషను మరింత పరిశోధనాత్మక పద్ధతిలో పెంపొందించుకున్నాడు. ప్రపంచ సినిమాను, ఇండియన్ సినిమాను పోల్చి అనేక విశ్లేషణలు చేశాడు. అదే కత్తిని మంచి సినీ విమర్శకుణ్ణి చేసింది. అనేకమంది అభిమానుల్ని అక్కున చేర్చింది. ఏ మహేష్ అంటే ఫిల్మ్ క్రిటిక్ కత్తి మహేష్ అనే పేరు అనతికాలంలోనే బాగా పాపులర్ అయింది. దీంతో రకరకాల టీవీ ఛానళ్లు కత్తి రివ్యూల కోసం స్పేస్‌ను కేటాయించాయి. ఆయన విశ్లేషణలకు ఆదరణ ఎంత వరకు వెళ్లిందంటే, కత్తి రివ్యూ చూశాకే కొత్త సినిమా చూడాలి అనే వరకు చేరింది. అట్లా నిర్మొహమాటంగా సినిమాలను సమీక్షించేవాడు. నిష్పక్షపాతంగా రేటింగులు ఇచ్చేవాడు. సినిమాలోని లోపాలను చెప్పినంత నిర్భయంగా వాటిలోని మంచి విషయాలను కూడా అంతే జాగ్రత్తగా చెప్పేవాడు. ఇదే కత్తిని కత్తిలా నిలబెట్టింది. అక్కడి నుండి రివ్వున గాలిలో ఎగిరినట్టు కత్తి పేరు, రూపమూ వెండితెర మీద కూడా కనిపించడం మొదలైంది. తనలోని నటుణ్ణి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చి మెప్పించాడు. అంతటితోటే సంతోష పడకుండా సినిమాలను డైరెక్ట్ చేసే స్థాయికి వెళ్లాడు. అట్లా రెండు మూడు సినిమాలకు డైరక్షన్ చేసి చూపించాడు. గాడ్‌ఫాదర్‌లు ఉంటే తప్ప రాణించలేని సినిమా ఇండస్ట్రీలో ఏ బ్యాక్‌గ్రౌండ్ లేకుండానే తనకంటూ ఒక గుర్తింపును, గౌరవాన్ని సంపాదించుకోగలిగాడు. ఈ నేపథ్యంలోనే ఒక అగ్రహీరో సినిమాల మీద తాను చేసిన విశ్లేషణల వల్ల అనేక ఆటుపోట్లను ఎదుర్కొన్నాడు. నిత్యం కొన్ని నెలలపాటు వేధింపులు ఎదురైనా సరే ధైర్యంగా వాటిని ఎదుర్కొన్నాడు. వేలాది ఫోన్‌కాల్స్, ప్రత్యక్ష బెదిరింపులకు సైతం జడవకుండా తన మాట మీదే నిలబడడం కత్తికి మరింత మంది అభిమానులను తెచ్చిపెట్టింది. అలా కత్తి మహేష్ అంటే ఒక తిరుగుబాటు, ఒక ధిక్కారం, ఒక తెగింపు అనే విషయం మన సమాజానికి తెలిసి వచ్చింది. ఇంతటితోటే ఆగిపోయి ఉంటే కత్తి మహేష్ కేవలం సినిమా మనిషి అయ్యేవాడు. కానీ, కత్తిలో ఒక సామాజిక ఆలోచనాపరుడు కూడా ఉన్నాడు. అందుకే ఆయన రాజకీయాల మీద కూడా దృష్టి సారించాడు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వస్తున్న మార్పులను నిత్యం సమీక్షించుకుంటూ, ఎవరు ప్రజలకు మేలు చేస్తారనే ఆలోచనలను సామాజిక మాధ్యమాల మీదుగా పంచుకునేవాడు. అట్లా కత్తి మాట్లాడేటప్పుడు తప్పకుండా రేపు భవిష్యత్తులో ఒక మంచి నేతగా ఎదిగి వస్తాడనే ఆశలు కల్పించాడు. ఇక కత్తిలో చాలామందికి నచ్చే అంశం అతడిలోని సామాజిక ఉద్యమకారునితనం. ఈ సమాజంలో కుల, మత బాధితుల పక్షం వహించాలనే ప్రజాస్వామికతనం తనను కుదురుగా ఉండనిచ్చేది కాదు. అందుకే ఎక్కడ దళితుల మీద దాడి జరిగినా రెక్కలు కట్టుకు వాలిపోయేవాడు. అది రోహిత్ వేముల పోరాటమైనా, మరొకటి అయినా బాధితులకు అండగా నిలబడడం అనేది తన జీవనవిధానంగా మార్చుకున్నాడు. సాధారణంగా సినీ పాపులారిటీ వచ్చిన వాళ్లు తమ కార్ల నల్లటి అద్దాలు దాటి బయటి ప్రపంచాన్ని చూడడానికి అంతగా ఇష్టాన్ని చూపించరు. కానీ, కత్తి వారికి భిన్నంగా ఈ సమాజంలో ఒక విద్యావంతునిగా, ఆలోచనాపరునిగా, సామాజిక చింతనాపరునిగా నిత్యం బాధితుల కోసం పని చేస్తూనే ముందుకు సాగాడు. ఇందుకోసం ఆయన బాబా సాహెబ్ అంబేద్కర్ ఐడియాలజీని ఆశ్రయించాడు. బహుజన మహనీయుల స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలని సూచించాడు. దళిత, బహుజనుల సకల సమస్యలకు రాజ్యాధికారమే మార్గమని నమ్మాడు. మరోవైపు కత్తిలో మంచి పాఠకుడు కూడా ఉన్నాడు. నిత్యం సాహిత్యాన్ని చదువుతూ, తరచుగా సాహిత్యసభలకు హాజరయ్యేవాడు. వక్తగా సాహిత్యసభల్లో మాట్లాడే సమయంలో కూడా ఏ వర్తమాన విమర్శకునికి తీసిపోని విధంగా తనదైన అధ్యయన అవగాహనతో సాహిత్యాన్ని విశ్లేషించేవాడు. సాహిత్యాన్ని ఎట్లా అర్థం చేసుకోవాలో అధునాతనమైన ప్రాపంచిక దృక్పథంతో విడమరిచి చెప్పేవాడు. అట్లా ఎంతోమంది సాహితీమిత్రులను కూడా సంపాదించుకున్నాడు. ఇన్ని రంగాల్లో సమానమైన జ్ఞానాన్ని కలిగి ఉండడం అందరికీ సాధ్యం కాదు. ఇట్లా ఎంతోమంది అభిమానులను, మిత్రులను సంపాదించుకున్న ఒక కలం, గళం అకాల మరణం పాలు కావడం ఎవ్వరూ ఊహించని పరిణామం. అత్యంత విషాదకరం. రేపటి అనేక పరిణామాలకు, మార్పులకు మూలస్తంభంగా నిలుస్తాడని ఆశించిన వారందరినీ తీవ్ర దు??ఃఖంలో ముంచి కత్తి మహేష్ వెళ్లిపోవడం బాధాకరం. అతనితో చాలా సన్నిహితంగా మెలిగిన నాలాంటి వారికి ఇదొక చీకటి రోజు. ప్రమాదకరమైన పరిస్థితులను ఎదురించి పోరాడి గెలిచిన కత్తిని, రోడ్డు ప్రమాదం మాత్రం ఓడించింది. ఈ సమాజం మేలు కోసం నిరంతరం పని చేసే ఒక సామాజిక గొంతును అకాల మరణం మూగబోయేలా చేసింది. ఆ మరపురాని మనిషికి కడసారి కన్నీటి జోహార్లు!!

# మండల కార్యాలయం ముందు బీజేపీ నేతల ధర్నా

**అధికార పార్టీ నాయకులకు కొమ్ము కాస్తున్న రెవెన్యూ సిబ్బంది**

**తహసీల్దార్ ను, విఆర్ఏ సస్పెండ్ చెయ్యాలని బీజేపీ నాయకులడిమాండ్**



జిన్నారం, జులై 14, ప్రజాపాలన ప్రతినిధి:ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్న పట్టించుకోకుండా అధికార పార్టీ నాయకులకు జిన్నారం తాహసిల్దార్ దశరథ్, రెవెన్యూ సిబ్బంది కొమ్ముకాస్తున్నారని జిన్నారం మండల బిజెపి పార్టీ నాయకులు, జిల్లా పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి ప్రతాప్ రెడ్డి ఆరోపిస్తున్నారు. బుధవారం జిన్నారం, బొల్లారం కి చెందిన బిజెపి నాయకులు మండలంలోని ఆయా గ్రామాల రైతులతో కలిసి తాహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. తాహసిల్దార్ దశరథ్, వీఆర్ఏ వెంకటేష్ పనితీరుకు నిరసన వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. అనంతరం నాయకులు ప్రతాపరెడ్డి మాట్లాడుతూ మండలంలోని రైతులకు చెందిన వ్యవసాయ భూములను ప్రభుత్వ భూములను తాహసిల్దార్, విఆర్ఏ లు కలిసి అధికార పార్టీకి చెందిన నాయకులకు కట్టబెడుతున్నారని, జిన్నారం బొల్లారం ప్రాంతాలలో చెరువులు కుంటలు కబ్జాలకు గురవుతున్నయని ఫిర్యాదు చేసిన పట్టించు కోకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ సిబ్బంది అధికారుల తీరు మార్చుకోకపోతే మునుముందు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. పెద్దమ్మ గూడెం గ్రామానికి చెందిన రైతులపై వీఆర్ఏ వెంకటేష్ బెదిరింపులకు పాల్పడుతున్నట్లు వారు ఆవేదన వ్యక్తంచేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తాహసిల్దార్ విఆర్ఏ లను జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా నిర్వహిస్తున్న నిరసనకారులను పోలీసులు జోక్యం చేసుకుని ధర్నా విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ రవీందర్ రెడ్డి, బిజెపి నాయకులు శివసాయి, రాజిరెడ్డి, దుబ్బ శ్రీను, రమేష్, పల్నాటి శ్రీనివాస్, బుక్క బిక్షపతి, సుధాకర్, రైతులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వలిగొండ మండలంలో 12 మందికి కరోనా పాజిటివ్

వలిగొండ ప్రజాపాలన ప్రతినిధి మండల పరిధిలోని వలిగొండ,వర్కట్ పల్లి,వేములకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో బుధవారం 223 మందికి కరోనా ర్యాపిడ్ పరీక్షలు నిర్వహించగా అందులో 12 మందికి పాజిటివ్ నిర్ధారణ అయిందని,వారికి కరోనా పట్ల తీసుకోవాలిసిన జాగ్రత్తలు తెలిపి,వారిని హెూమ్ క్వారెంటైన్ చేశామని డాక్టర్లు సుమన్ కళ్యాణ్,కిరణ్ కుమార్,స్వామి లు తెలిపారు.

## కేటీఆర్ జన్మదినం సందర్భంగా భారీగా మొక్కలు నాటాలి



బోనకల్, జులై 14, ప్రజాపాలన ప్రతినిధి: బోనకల్లు జులై 14, ప్రజాపాలన ప్రతినిధి:మొదటిగా బోనకల్ సాయిబాబా టెంపుల్ లో జరుగుతున్నటువంటి యార్లగడ్డ ధర్మ గారి మేనకోడలు అన్నప్రాసన వేడుక హాజరై చిన్నారిని దీవించారుఅనంతరం బోనకల్ %శీ% ఖమ్మం రోడ్ లో పల్లె ప్రగతి లో భాగంగా నాటుతున్నటువంటి మొక్కలను పరిశీలించారుఅనంతరం పార్టీ సీనియర్ నాయకురాలు మంద ధనమ్మ గారు మరణించడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారుఅనంతరం బోనకల్ మండల టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ జూలై 24న జరగనున్న టిఆర్ఎస్ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ రాష్ట్ర మున్సిపల్ మరియు ఐటీ శాఖ మాత్యులు కల్వకుంట్ల తారక రామారావు గారి పుట్టినరోజు సందర్భంగా కోటి వృక్ష అర్చన లో భాగంగా బోనకల్ మండలం లో ప్రతి ఒక్క గ్రామంలోలో అత్యధిక మొక్కలు నాటి కేటీఆర్ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బోనకల్ మండల టిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు, మండల గ్రామ నాయకులు, ప్రజా ప్రతినిధులు,సర్పంచులు ఎంపీటీసీలు, గ్రామ అధ్యక్షులు సొసైటీ డైరెక్టర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు, రైతుబంధు సమితి అధ్యక్షులు

## బిల్లులు చెల్లించాలని ఉప్పల్ జిహెచ్ఎంసి కార్యాలయం ముందు కాంట్రాక్టర్లు ధర్నా



మేడిపల్లి, జులై14 (ప్రజాపాలన ప్రతినిధి) :చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని కోరుతూ ఉప్పల్ జిహెచ్ఎంసి కార్యాలయం ముందు ఉప్పల్ కాంట్రాక్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. నో పేమెంట్ నో వర్క్ అంటూ కాంట్రాక్టర్లు నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. చేసిన పనులకు కొన్ని నెలల నుండి బిల్లులు జిహెచ్ఎంసి వారు చెల్లించడం లేదని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు చెల్లించకపోవడంతో నేటి నుండి అత్యవసర పనులను నిలిపివేస్తున్నట్లు కాంట్రాక్టర్లు తెలిపారు. అనంతరం ఉప్పల్ కాంట్రాక్టర్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా ఎస్ మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా జి రమేష్ ఎన్నికయ్యారు. వీరితో పాటు మిగతా కమిటీ సభ్యులను కూడా ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఎం మురళి,రవి కుమార్, కుమార్,శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలతో పటిష్ట భద్రత



పటాన్చేరు,జులై 14, ప్రజాపాలన ప్రతినిధి:నేటి ఆధునిక సమాజం లో సీసీ కెమెరాల ఆవశ్యకత పెరిగిందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం పటాన్చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు ప్రాంగణంలో ఏడు లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన 24 సీసీ కెమెరాలను ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 ఎకరాల్లో విస్తరించిన మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా రైతులకు, వ్యాపారస్తులకు మరింత భద్రత కల్పించినట్లు అయిందన్నారు. ఇప్పటికే మార్కెట్ యార్డులో సిసి రోడ్లు, షెడ్లు, టాయిలెట్లు వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మార్కెట్ యార్డ్ మరింత అభివృద్ధి పరిచేందుకు నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్పర్సన్ హారిక విజయ్ కుమార్, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భానురి మల్లారెడ్డి, డైరెక్టర్లు మల్లికార్జున్, శివారెడ్డి, ప్రమోద్ గౌడ్, వంగరి అశోక్, గౌరీ శంకర్,నారాయణ రెడ్డి, అధికారులు, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటేష్, షకీల్, అజ్మత్, సాగర్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## కరోనా మృతులకు ఎక్స్గ్రేషియా తోపాటు ఇన్సూరెన్స్ చెల్లించాలి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కొత్తగూడెం, జులై 14 ,ప్రజా పాలన, ప్రతినిధి : సింగరేణికాలరీస్,కాంట్రా క్ట్ వర్కర్స్ యూనియన్ ఐ, ఎఫ్. టి. యు. రాష్ట్ర కమిటీ నిర్ణయం లో భాగంగా బుధవారం కొత్తగూడెం కార్పొరేట్ ఆఫీసులో డైరెక్టర్ (పా) కు వినతి పత్రం అందజేసిన ,మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య రాష్ట్ర అధ్యక్షులు ఏ వెంకన్న, కార్యదర్శి షేక్, యాకుబ్ షావలి ఉపా ధ్యక్షులు, , సంజీవ్,గుమ్మడి నర్సయ్య వెంకన్న లు (పా)కు వివరిస్తూ కాంట్రాక్టు కార్మికులకు కరోనా వ్యాక్సిన్ ఇవ్వాలి కరోనా బారిన పడిన కార్మికులకు 15. రోజులు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలి కరోనాతోమరణించి న కాంట్రాక్టు కార్మికులకు15 లక్షల ఎక్స్గ్రేషియా తో పాటు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలికోల్ ట్రాన్స్పోర్ట్, బయ్యర్లు, కాంట్రాక్టర్ల వద్ద సింగరేణియాజమా న్యం నిర్మించినవే బ్రిడ్జిల వద్ద బంకర్లు డంపు యార్డ్ ల వద్ద బొగ్గు లారీ లోడింగ్ అన్లోడింగ్ చేస్తున్న కార్మికులకు వైద్య సదుపాయం కల్పించాలి సులబ్ కార్మికులకు బోనస్, సి.ఎమ.పి.ఎఫ్., వైద్య సదుపాయం కల్పించాలి సింగరేణి కోల్ ట్రాన్స్పోర్ట్, డ్రైవర్లకుఅద్దె వాహనాల డ్రైవర్లకు, రికవరీ చెయ్యాలి కాంట్రాక్టర్ వాట,సింగరేణియాజమాన్యం చెల్లించాలి. నర్సరీ కార్మికులనుకాంట్రాక్టు కార్మికులుగా గుర్తించి, బోనస్, కనీస వేతనా లు, మరియు వైద్యం కల్పించాలి. సేల్ పీకింగ్,కార్మికు లకు సెమీ %ంఎఆశ్రీశ్రీఀ%వేతనా లు, అమలు చేయాలిసోలార్ ప్లాంట్ల లో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు చట్టబద్ధ హక్కులను సౌకర్యాలు అమలు చేయాలిహాస్పటల్ లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు స్పెషల్ ఇన్సెంటివ్ ఇవ్వాలి ఇసుక బంకర్ వద్ద పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలుఅమలు చేయాలి డైరెక్టర్ (పా) పై విషయాల పై సానుకూ లంగా స్పందించారు ఈ కార్యక్రమంలో, పి సతీష్ పాల్గొన్నారు.


## బిల్లులు చెల్లించాలని ఉప్పల్ జిహెచ్ఎంసి కార్యాలయం ముందు కాంట్రాక్టర్లు ధర్నా



మేడిపల్లి, జులై14 (ప్రజాపాలన ప్రతినిధి) :చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని కోరుతూ ఉప్పల్ జిహెచ్ఎంసి కార్యాలయం ముందు ఉప్పల్ కాంట్రాక్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. నో పేమెంట్ నో వర్క్ అంటూ కాంట్రాక్టర్లు నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. చేసిన పనులకు కొన్ని నెలల నుండి బిల్లులు జిహెచ్ఎంసి వారు చెల్లించడం లేదని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు చెల్లించకపోవడంతో నేటి నుండి అత్యవసర పనులను నిలిపివేస్తున్నట్లు కాంట్రాక్టర్లు తెలిపారు. అనంతరం ఉప్పల్ కాంట్రాక్టర్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా ఎస్ మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా జి రమేష్ ఎన్నికయ్యారు. వీరితో పాటు మిగతా కమిటీ సభ్యులను కూడా ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఎం మురళి,రవి కుమార్, కుమార్,శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


## టిఆర్ఎస్ గూటికి చేరనున్న టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి



వికారాబాద్ జూలై 14 ప్రజాపాలన బ్యూరో : తెలంగాణ రాష్ట్రంలో టిడిపికి భవిష్యత్తు లేకపోవడంతో టిడిపేతర పార్టీల వైపు దృష్టి సారిస్తున్నట్లు సమాచారం. అధికార టిఆర్ఎస్ పార్టీలో చేరేందుకు తమ అనుచరగణంతో సమాలోచనలు జరుపుతున్నారు. అందులో భాగంగానే రాష్ట్ర తెలుగు దేశం అధ్యక్షుడు ఎల్.రమణ త్వరలో టిఆర్ఎస్ కండువా కప్పుకోనున్నట్లు విశ్వసనీయ సమాచారం. రాష్ట్రంలో టిడిపి పగ్గాలు పట్టి నడపాల్సిన వ్యక్తే పార్టీ మారబోతున్నారనే విషయాన్ని తెలుసుకున్న కార్యకర్తల ఆలోచనలు కూడా మారాయి. తమ నాయకునితో పాటు మేము ఉంటామని ధీమా వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. వికారాబాద్ జిల్లాలో మోమిన్ పేట్ మండల పరిధిలో గల కోలుకుంద గ్రామానికి చెందిన టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కరణం రామకృష్ణ త్వరలో టిఆర్ఎస్ గూటికి చేరనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో మోమిన్ పేట్ మండలం తెలుగు దేశానికి కంచుకోటలా నిలిచింది. కానీ, స్వరాష్ట్రం సాధించుకున్న తరువాత టిడిపికి బీటలు పారడం మొదలయ్యాయి. తమ నాయకుడు టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ అడుగు జాడల్లో నడవనున్నామని కరణం రామకృష్ణ బుధవారం ప్రజాపాలన బ్యూరో రిపోర్టర్ తో చరవాణి ద్వారా తెలిపారు. కోలుకుంద గ్రామానికి చెందిన సర్పంచ్ కరణం పార్వతమ్మ, ఎంపిటిసి శ్రీదేవి, కొత్తకోలుకుంద గ్రామ సర్పంచ్ కొనింటి సురేష్ లతో కలిసి త్వరలో టిఆర్ఎస్ గూటికి చేరనున్నామని పేర్కొన్నారు.


## మండల కార్యాలయం ముందు బీజేపీ నేతల ధర్నా



జిన్నారం, జులై 14, ప్రజాపాలన ప్రతినిధి:ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్న పట్టించుకోకుండా అధికార పార్టీ నాయకులకు జిన్నారం తాహసిల్దార్ దశరథ్, రెవెన్యూ సిబ్బంది కొమ్ముకాస్తున్నారని జిన్నారం మండల బిజెపి పార్టీ నాయకులు, జిల్లా పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి ప్రతాప్ రెడ్డి ఆరోపిస్తున్నారు. బుధవారం జిన్నారం, బొల్లారం కి చెందిన బిజెపి నాయకులు మండలంలోని ఆయా గ్రామాల రైతులతో కలిసి తాహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. తాహసిల్దార్ దశరథ్, వీఆర్ఏ వెంకటేష్ పనితీరుకు నిరసన వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. అనంతరం నాయకులు ప్రతాపరెడ్డి మాట్లాడుతూ మండలంలోని రైతులకు చెందిన వ్యవసాయ భూములను ప్రభుత్వ భూములను తాహసిల్దార్, విఆర్ఏ లు కలిసి అధికార పార్టీకి చెందిన నాయకులకు కట్టబెడుతున్నారని, జిన్నారం బొల్లారం ప్రాంతాలలో చెరువులు కుంటలు కబ్జాలకు గురవుతున్నయని ఫిర్యాదు చేసిన పట్టించు కోకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ సిబ్బంది అధికారుల తీరు మార్చుకోకపోతే మునుముందు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. పెద్దమ్మ గూడెం గ్రామానికి చెందిన రైతులపై వీఆర్ఏ వెంకటేష్ బెదిరింపులకు పాల్పడుతున్నట్లు వారు ఆవేదన వ్యక్తంచేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తాహసిల్దార్ విఆర్ఏ లను జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా నిర్వహిస్తున్న నిరసనకారులను పోలీసులు జోక్యం చేసుకుని ధర్నా విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ రవీందర్ రెడ్డి, బిజెపి నాయకులు శివసాయి, రాజిరెడ్డి, దుబ్బ శ్రీను, రమేష్, పల్నాటి శ్రీనివాస్, బుక్క బిక్షపతి, సుధాకర్, రైతులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


## జిల్లా అభివృద్ధి సమన్వయ కమిటీ దిశ సమావేశం



జగిత్యాల, జులై 14 (ప్రజాపాలన ప్రతినిధి): జగిత్యాల పట్టణంలోని సుమంగలి గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన జగిత్యాల జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశంలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత ఎమ్మెల్యేలు డా: సంజయ్ కుమార్ కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు జిల్లా కలెక్టర్ రవి జడ్పీ సీఈవో వినోద్ వివిధ శాఖల అభివృద్ధి పనుల అంశాలపై జిల్లా అధికారులు ప్రజాప్రతినిధులు సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.

## పాఠశాలలో పాఠ్యపుస్తకాల ఉచితంగా పంపిణీ



మహబూబాద్ జిల్లా, దంతాలపల్లి మండలం న్యూస్,జులై 14, ప్రజాపాలన ప్రతినిధి: దంతాలపల్లి ఉన్నత పాఠశాలలో ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ చేయడం జరిగింది ఈ రోజు సుమారు 100 మంది పిల్లలకు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి శ్రీనివాస్ ఉపాధ్యాయులు హరిబాబు. సురేంద్ర గుప్తా. హర్షవర్ధన్ రెడ్డి .యాకమల్లయ్య. కుమారస్వామి .తదితరులు పాల్గొన్నారు


## సీసీ కెమెరాలతో పటిష్ట భద్రత



పటాన్చేరు, జులై 14, ప్రజాపాలన ప్రతినిధి:నేటి ఆధునిక సమాజం లో సీసీ కెమెరాల ఆవశ్యకత పెరిగిందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం పటాన్చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు ప్రాంగణంలో ఏడు లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన 24 సీసీ కెమెరాలను ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 ఎకరాల్లో విస్తరించిన మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా రైతులకు, వ్యాపారస్తులకు మరింత భద్రత కల్పించినట్లు అయిందన్నారు. ఇప్పటికే మార్కెట్ యార్డులో సిసి రోడ్లు, షెడ్లు, టాయిలెట్లు వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మార్కెట్ యార్డ్ మరింత అభివృద్ధి పరిచేందుకు నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్పర్సన్ హారిక విజయ్ కుమార్, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భానురి మల్లారెడ్డి, డైరెక్టర్లు మల్లికార్జున్, శివారెడ్డి, ప్రమోద్ గౌడ్, వంగరి అశోక్, గౌరీ శంకర్,నారాయణ రెడ్డి, అధికారులు, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటేష్, షకీల్, అజ్మత్, సాగర్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా అభివృద్ధి సమన్వయ కమిటీ దిశ సమావేశం



జగిత్యాల, జులై 14 (ప్రజాపాలన ప్రతినిధి): జగిత్యాల పట్టణంలోని సుమంగలి గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన జగిత్యాల జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశంలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత ఎమ్మెల్యేలు డా: సంజయ్ కుమార్ కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు జిల్లా కలెక్టర్ రవి జడ్పీ సీఈవో వినోద్ వివిధ శాఖల అభివృద్ధి పనుల అంశాలపై జిల్లా అధికారులు ప్రజాప్రతినిధులు సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.

# గిలిగెట్ పల్లిలో ఎడ్ల బజార్ నిర్మాణం

## మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్



వికారాబాద్ జూలై 14 ప్రజాపాలన బ్యూరో : వికారాబాద్ మున్సిపల్ పరిధిలో గల గిరిగెట్ పల్లిలోని సర్వే నంబర్ 28/1లో 5ఎకరాల ప్రభుత్వ భూమిలో ఎడ్ల బజార్ నిర్మించనున్నామని మార్కెట్ కమిటీ చైర్మన్ పాపగారి విజయ్ కుమార్ అన్నారు. బుధవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆయన మాట్లాడుతూ..ఆలంపల్లి బిలాదాఖల్ మరియు గంగారంలోని సర్వే నంబర్ 67లో 20 ఎకరాల ప్రభుత్వ భూమిలో గోదాములు నిర్మించనున్నట్లు తెలిపారు. మార్కెట్ యార్డులో 36 లక్షలతో కవర్డ్ షెడ్, 30 లక్షలతో సిసి రోడ్లు నిర్మాణం చేవట్టనున్నామని పేర్కొన్నారు. ఒక కోటి రూపాయలతో 20 కమర్షియల్ దుకాణాలు నిర్మిస్తామని వివరించారు. 5 కోట్ల నిధులతో రైతుబజార్ లో సమీకృత మార్కెట్ నిర్మాణం చేవట్టడం జరుగుతుందన్నారు. 2020-21వ సంవత్సరంలో మార్కెట్ కమిటీకి 3 కోట్ల 72 లక్షల ఆదాయం మార్కెట్ ఫీ జు రూవంలో సమకూరిందన్నారు. 2019-20వ సంవత్సరంలో ఒక కోటి 22 లక్షల ఆదాయం వచ్చిందని వివరించారు. ఏప్రిల్ నుండి జూన్ వరకు 2 కోట్ల 50 లక్షల ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. 2020-21 లో కాటన్, కందుల ధరలు మినిమమ్ సేల్ ప్రైస్ కన్నా అదనంగా ఉ ండడం వలన మార్కెట్లో అమ్మకాలు జరిగాయన్నారు. నిర్మాణాలకు వికారాబాద్ మున్సిపాలిటీ ఎన్ఓసి ఇచ్చిందని చెప్పారు. నిధుల మంజూరు కోసం వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. ఇతర ప్రాంతాల నుండి వచ్చే ప్రజలకు రాత్రి బస కొరకు 80 గజాల స్థలాన్ని మున్సిపల్ కేటాయించిందన్నారు. త్వరలో ఈ పనులన్నీ ప్రారంభం కానున్నాయని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం రైతు బంధు రైతు బీమా వంటి పథకాలను కల్పిస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రం అని కొనియాడారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అమ్రాది నర్సిములు, మార్కెట్ కమిటీ కార్యదర్శి వెంకట్ రెడ్డి, మార్కెట్ సీనియర్ అసిస్టెంట్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ కంట్రోల్ రూం ఏర్పాటు: జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్



వికారాబాద్ జూలై 14 ప్రజాపాలన బ్యూరో :జిల్లాలో భారీ వర్షాల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా ఎలక్ట్రిసిటీ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడమైనదని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ అంతరాయం ఏర్పడినట్లయితే వెంటనే కంట్రోల్ రూమ్ నెంబర్ 9493193177 కు కాల్ చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాల్ చేసిన వెంటనే విద్యుత్ అధికారులు తక్షణమే స్పందించి సమస్యలు పరిష్కరిస్తారని పేర్కొన్నారు.

## జీవన్ రెడ్డి త్వరగా కోలుకోవాలని పూజలు



సారంగాపూర్, జులై 14 (ప్రజాపాలన ప్రతినిధి): సారంగాపూర్ మండల్ పెంబట్ల శ్రీ దుబ్బరాజేశ్వర స్వామి దేవాలయంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి కరోనా పాజిటివ్ రావడంతో ఆయన త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ కొంద్ర రాంచందర్ రెడ్డి సర్పంచులు బొద్దుపల్లి రాజన్న ఆకుల జమునరాజిరెడ్డి మోదుకూరు ప్రసాద్ ఎండి ఇబ్రహీం కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ రమణకు సంఘీభావంగా టీడీపీ నాయకులు రాజీనామాలు

జగిత్యాల/ సారంగాపూర్, జులై 14 (ప్రజాపాలన ప్రతినిధి): ఎల్. రమణకు సంఘీభావంగా టీడీపీ జగిత్యాల పట్టణ కమిటీ అనుబంధ సంఘాలు తెలంగాణ తెలుగు దేశం రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శికి రాజీనామాలను పంపించారు.జగిత్యాల పట్టణ పార్టీ అధ్యక్షుడు కార్యవర్గం రాజీనామాలు చేశారు.పట్టణ పార్టీ అధ్యక్షులు కొండ శ్రీధర్ ప్రధాన కార్యదర్శి తుమ్మనపెల్లి రమేష్ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి అజ్గర్ ఖాన్ పొట్టవత్తిని చక్రపాణి కుడిక్యాల సర్వేశ్వర్ వెన్నమానేని కృష్ణారావు ఆముద శ్రీనివాస్ బానుక మహేష్ డబ్బుగొట్టు గోవర్ధన్ బుర్ర గిరిధర్ గంధం సుధాకర్ చిగుర్ల మల్లయ్య సింహ రాజు శ్రీధర్ మసర్ధి సతీష్ ఆరే శంకర్ బడుగు రాజు నక్క లక్ష్మణ్ బసోజి రవి బండ్ల ఏసుబు కబీర్ భాయ్ రాషద్ హైమద్ రహీంభాయ్ జాకీర్ అన్ను భాయ్ ఇర్ఫాన్ భాయ్ రాజీనామాలు చేశారు. సారంగాపూర్ మండల్ టీ.టీడీపీ నాయకులు ఎల్. రమణకు సంగిభావంగా రాజీనామాలను టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి తెలియజేశారు. మండల పార్టీ అధ్యక్షుడు ఆనంతుల గంగారెడ్డిఎండబెట్ల కిషోర్ కుసుంబ సంతోష్కైరి శ్రీనివాస్ పసుల దేవయ్య పరుమల్ల దుబ్బయ్య కొప్పుల వేణు బసమల్ల మల్లేష్ సిద్ధం శంకర్ మ్యాకల మల్లయ్య కుంటాల చిన్నారాజం అనేగాళ్ల గంగారాం సిర్రం గంగరాజం తదితరులు రాజీనామాలు చేశారు.

## మహేష్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటాం: మాజీ కార్పొరేటర్ జోత్స్నానాగేశ్వరావు




మేడిపల్లి, జూలై14 (ప్రజాపాలన ప్రతినిధి) : రామంతాపూర్ డివిజన్లో ఇటీవల కోవిడ్ కారణంగా జిహెచ్ఎంసీ శానిటేషన్ జవాన్ మహేష్ మరణించారు. డివిజన్ మాజీ కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ మెంబర్ గంథం జోత్స్న నాగేశ్వరావు ఇచ్చిన మాట ప్రకారం మహేష్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని, మహేష్ కూతురు(కీర్తి)ని చదివించటానికి ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ జోత్స్ననాగేశ్వరావు మాట్లాడుతూ మహేష్ కుటుంబానికి పూర్తి స్థాయిలో ఏ లోటు రాకుండా చుస్తామని హామీ ఇచ్చారు. మహేష్ కూతురు చదువుకునేందుకు పూర్తి స్థాయిలో చదువుకునేంతవరకు సహయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఆదేవిదంగా స్కూల్ యాజమాన్యం వారితో మాట్లాడి సంవత్సరం ఫీజు ను కట్టేసి పుస్తకాలు అందజేశారు. మావంతుగా సహకారం అందిస్తామని స్కూల్ యజమాన్యం తెలిపారు.ఈ సందర్భంగా రామంతాపూర్ డివిజన్ తెరాస నాయకులు ,స్తానికులు ,ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ రాంరెడ్డి పాల్గొన్నారు.

## నిజామాబాద్ ఎంపీని కలిసిన బిజెవైఎం నాయకులు



మెట్ పల్లి, జూలై 14 (ప్రజాపాలన ప్రతినిధి) : నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ను బుధవారం మెట్ పల్లికి చెందిన బిజెవైఎం నాయకులు కలిశారు. బీజేవైఎం మెట్ పల్లి పట్టణ నూతన అధ్యక్షుడు ఆర్మూర్ రంజీత్ తో పాటు స్థానిక బిజెవైఎం నాయకులు కలిశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. స్థానికంగా బీజేపీని బలోపేతం చేయడానికై ముందుండి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ జేఎన్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



ఎర్రుపాలెం, జులై 14, ప్రజాపాలన ప్రతినిధి:ఎర్రుపాలెం మండలంలో లీడర్ భట్టి విక్రమార్క మల్లు గారి సిఫార్సు మేరకు వచ్చిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత, మధిర శాసనసభ్యులు గౌ"శ్రీ. భట్టి విక్రమార్క మల్లు గారి సిపార్స్ మేరకు కేవలం ఒక్క ఎర్రుపాలెం మండలం లోని వివిధ గ్రామాల్లో 9 మందికి వివిధ వ్యాధుల భారిన పడి వారికి హాస్పిటల్స్ బిల్లులకు గాను 134000విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎర్రుపాలెం మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఈరోజు ఎర్రుపాలెం మండల కేంద్రంలో అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి చేతులమీదుగా పంపిణీ చేశారు..ఎమ్ అప్పిరెడ్డి తెక్కళ్లపాడు -వి వెంకమ్మమొలుగుమాడు- 18000ఎమ్ నవీన్ వెంకటాపురం-11500పి నాగేంద్రమ్మ బనిగండ్లపాడు-14500 కె కనకమ్మ కొత్త గోపవరం-18000బి పెద్ద బొడియ్య-16000ఎమ్ దీపిక జమలాపురం-29000బి జ్యోతి రామన్నపాలెం-12000ఎన్ రమేష్ ఎర్రుపాలెం- 6000మొత్తం-134000 విలువైన చెక్కులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బండారు నరసింహారావు, శీలం శ్రీనివాసరెడ్డి,నాయకులు శీలం నర్సిరెడ్డి,కడియం శ్రీను,కంచర్ల వెంకటనరసయ్య,షేక్ ఇస్మాయిల్, దేవరకొండ శ్రీను,నాగిరెడ్డి శ్రీనివాసరావు, భానావత్ శ్రీను తదితరులు పాల్గొన్నారు

## ఈజిఎస్ సాంకేతిక సహాయకుడిపై జరిగిన అఘాయిత్యానికి నిరసన



సారంగాపూర్, జులై 14 (ప్రజాపాలన ప్రతినిధి): నిర్మల్ జిల్లాలో మంగళవారం రోజున మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న సాంకేతిక సహాయకుడు రాజుపైన జరిగిన అఘాయిత్యానికి నిరసనగా బుధవారం రోజున సారంగాపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జె. పుల్లయ్య కార్యాలయ పర్యవేక్షణ అధికారి పద్మాలత కంప్యూటర్ ఆపరేటర్ సూర కోటిరెడ్డి సాంకేతిక సహాయకులు వినోద్ శ్రీలత కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ కరోనా నుండి కోలుకొని ప్రజాసేవలోకి రావాలని పూజలు...



జగిత్యాల, జులై 14 (ప్రజాపాలన ప్రతినిధి): జగిత్యాల పట్టణంలోని మాడేలేశ్వర స్వామి ఆలయంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి కరోనా పాజిటివ్ నుండి తొందరగా కోలుకోవాలని యధావిధిగా ప్రజాసేవలోకి రావాలని భగవంతుడుని కోరుకుంటూ గాంధీనగర్ గణేష్ నగర్ చింతకుంట వార్డ్ కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నక్క జీవన్ అల్లాల రమేష్ రావ్ గాజుల రాజేందర్ బొల్లారపు గిరిధర్ బడుగు రాజేందర్ నక్క రాజయ్య నీలం పెద్దలు రవి రాము లక్ష్మణ్ మైసయ్య కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు సబ్బులు, నూనెలు పంపిణీ



బాలాపూర్: (ప్రతినిధి) ప్రజా పాలన న్యూస్‌బీ : కార్పొరేషన్ ను పరిశుభ్రంగా ఉంచడానికి విధి నిర్వహణ (పారిశుద్ధ్య సిబ్బంది) కార్మికుల కనీస అవసరాలకు అనుగుణంగా సహాయ సహకారాలు అందించాలని కార్పొరేషన్ మేయర్ పేర్కొన్నారు. బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పని చేస్తున్న శానిటేషన్ సిబ్బందికి ప్రతి సంవత్సరం ఇస్తున్న సబ్బులు, కొబ్బరినూనెలు ఈ ఏడాది కార్పొరేషన్ కార్యలయంలో మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి చేతులమీదుగా పంపిణీ చేసే కార్యక్రమానికి, కార్పొరేషన్ అధికారులతో పాటు డిప్యూటీ మేయర్ ఇబ్రమ్ శేఖర్, లతో కలిసి పారిశుద్ధ్య సిబ్బందికి దజను పైయ (ఒంటి) సబ్బులు, బట్టల సబ్బులు, అదే విధంగా అరడజను కొబ్బరినూనె డబ్బాలు,అలాగే సి డి ఎం ఏ వారి ద్వారా వచ్చిన రెండు ఎల్ ఈ డి బల్బులు, ఒక దుప్పటిని శానిటేషన్ సిబ్బందికి బుధవారం నాడు మేయర్ అందజేశారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ.... అహర్నిశలు కార్పొరేషన్ పరిశుభ్రంగా ఉంచడానికి పని చేస్తున్న కార్మికులకు చేదోడు వాదోడుగా ఉండడానికి ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషకరం అని అన్నారు. ప్రతి రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు శుభ్రపరిచినందువల్ల ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా తిరిగే మనుషులు ఉన్నారని అన్నారు. వారి సేవలు లెక్క కట్టలేమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రమ్ శేఖర్, డీఈఈ అశోక్ రెడ్డి, కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్ రెడ్డి, సుర్ణగంటి అర్జున్, సుక్క శివ కుమార్, పెద్దబావి శ్రీనివాస్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు రఘునందన చారి, నాయకులు రామోజీ శ్రీశైలం చారి, లిక్కి కృష్ణ రెడ్డి, కార్పొరేషన్ అధికారులు మేనేజర్ శ్రీధర్ రెడ్డి, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పీర్జాదిగూడలో వృత్తి విద్యా నైపుణ్యం కోర్సులు ఏర్పాటు: మేయర్ జక్క వెంకట్ రెడ్డి



మేడిపల్లి, జులై14 (ప్రజా పాలన ప్రతినిధి) : పీర్జాదిగూడ నగరపాలక సంస్థ పౌరులకు, మహిళలకు వృత్తి విద్యా, నైపుణ్యం కలిగిన కోర్సులను ఏర్పాటు చేయాలనే ఉద్దేశ్యంతో మేయర్ జక్క వెంకట్ రెడ్డి బుధవారం సెట్విన్ మేనేజింగ్ డైరెక్టర్ వేణుగోపాల్ రావుని నగరపాలక సంస్థకు ఆహ్వానించి సెట్విన్ ట్రైనింగ్ సెంటర్ కొరకు కేటాయించిన కోవిడ్ ఐసోలేషన్ సెంటర్ (పాత పోలీస్ స్టేషన్) భవనంను పరిశీలించారు. అనంతరం మేయర్ చాంబర్లో డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులతో సమావేశమై ట్రైనింగ్ సెంటర్లో ఏర్పాటు చేసే కోర్సుల పై చర్చించారు.ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ వనజ, కార్పొరేటర్లు మద్ది యుగేందర్ రెడ్డి, కె. సుభాష్ నాయక్, కొల్తూరు మహేష్, కుర్ర షాలిని, ఎన్. మధుసూదన్ రెడ్డి, పప్పుల రాజేశ్వరి, కో ఆప్షన్ సభ్యులు, నాయకులు బొడిగే కృష్ణా గౌడ్, కుర్ర శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రజాపాలన

జాతీయ తెలుగు దినపత్రిక తెలుగురాష్ట్రాల్లో విస్తృత పర్చేందుకు మా బిజినెస్ అసోసియేట్స్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దిగువ ఇవ్వబడిన బిజినెస్ అసోసియేట్స్ 'ప్రజాపాలన' జాతీయ తెలుగు దినపత్రికలో వార్తా సంబంధ విషయాల్లో,ప్రకటనలు స్వీకరించేందుకు,ప్రజాపాలన దిన పత్రిక చందా విషయమై ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటారు.

బిజినెస్ అసోసియేట్స్-టెలిఫోన్ నెంబర్లు

| | | |
|---|---|---|
| కడమంచి నారాయణ దాస్ | చేవెళ్ల | 9849526878 |
| డి. వరప్రసాద్ | తెల్లాపూర్ | 9553999990 |
| గణేష్ | బాలాపూర్ | 7993047109 |
| నరోత్తమ్‌రెడ్డి | మేడిపల్లి | 9346970159 |
| వెంకటచారి | మందమర్రి | 9440868581 |
| వెంకటస్వామి | మంచిర్యాల | 9515048103 |
| కళ్యాణ్ సి.ఎం. | కూకట్‌పల్లి | 7842672389 |
| ఎం. గైబులు | వికారాబాద్ | 9704570475 |
| శైలజ | శేర్లింగంపల్లి | 8919627871 |
| సత్య కిషోర్ | సిద్దిపేట | 6309723472 |
| సిహెచ్.ఆంజనేయులు | పరిగి | 966410714 |
| బోడ మనోహర్ నంద | కరీంనగర్ | 9492417684 |
| బోడ మమత | జగిత్యాల | 9491127684 |
| ఓ.వి.దుర్గారావు | భద్రాద్రి కొత్తగూడెం | 9581872881 |
| జె.రాంబాబు | అశ్వరరావుపేట | 9505678245 |
| బి.శ్రీకాంత్ | భద్రాచలం | 9398430470 |
| సి.సుధీర్‌కుమార్ | సుజాతనగర్ | 9701992529 |
| రాజేందర్ ప్రసాద్ | ఖమ్మం | 7013953536 |
| పి.ఎన్.శ్రీనివాస్ | మధిర | 9030821362 |
| గంజిగుంట్ల వెంకన్న | పాలేరు | 9848895405 |
| ఆర్.రాజేశ్వర్ రావు | మయూర్ సెంటర్ | 9160400339 |
| మాలేడు నరేందర్ | ఖమ్మం రూరల్ | 8074550397 |
| టివిఎస్.చక్రవర్తి | ఖమ్మం టౌన్ | 9948327333 |
| కె.సత్యం | పటాన్‌చెరు | 9866500289 |

## బౌద్ధం - సోషలిజం

# సోషలిజం అంటే ఏమిటి?



- బి ఎస్ రాములు
సెల్: 8331966987

(తొమ్మిదవ భాగం)

**భక్తి ఉద్యమాల కాలం:**

భక్తి ఉద్యమాల కాలాన్ని, శూద్ర విప్లవాల కాలాన్ని కొందరు మధ్య యుగాల పేరిట అంధయుగంగా పరిగణిస్తున్నారు. అది ఎవరివల్ల అంధ యుగం అయింది? ఎవరి వల్ల వెలుగు ప్రసరించింది అని చూస్తే మంచిది. శూద్రుల జీవితాల్లో యూరపు ప్రవేశంతో అంధయుగం ప్రారంభమైంది. ఉత్పత్తి కులాలు రెండవ దశలో కార్మికులుగా రూపాంతరం చెందారు. ఈలోపు వారు దారిద్ర్యానికి చేరువైపోయారు. పారిశ్రామిక విప్లవాలు శూద్రుల్ని అంధయుగంలోకి నెట్టి అగ్రకులాలలకు వెలుగునిచ్చాయి. అందువల్ల ఆధునిక భారత సామాజిక, ఆర్థిక రంగాల్లో అగ్రకులాలు నాయకత్వంలోకి రావడం సాధ్యమైంది. వారి 'కులాధిక్యతే' పెట్టుబడిదారీ అభివృద్ధిలో నాయకత్వానికి మరో కారణంగా కలిసివచ్చింది.

**ప్రపంచాన్ని దోచి అభివృద్ధి చెందిన యూరప్:**

ఆసియా, ఆఫ్రికా, రెడ్ యిండియన్స్, అమెరికాలను దోచిన సొమ్ము కలుపుకుని యూరపు పారిశ్రామిక విప్లవం ప్రారంభమైంది. ముఖ్యంగా 14వ శతాబ్దం నుండి సంపదతో పాటు భావజాల, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక విప్లవాలు ఆసియా నుండి యూరపుకు మారాయి. ఆసియా ఔన్నత్యం వెనుకబడిపోయింది. యూరపులో జరిగిన అభివృద్ధి ఆసియా తదితర దేశాల సంపత్తితో జరిగిందే గనుక అక్కడి విజ్ఞానాభివృద్ధి శూద్రుల, అతిశూద్రుల సంపద కైవసం ద్వారా జరిగినట్టే. యూరపు ఆధునిక భావాలు శూద్ర, అతిశూద్ర శ్రమ సంపదల నుండి పుట్టినట్టే. అయితే యూరపు ఆధిక్యత కారణంగా విజ్ఞానాభివృద్ధి యూరపు ఆధిక్యతకనువుగా సాగింది. ఆ వివరాలు కొంత పరిశీలించడం అవసరం.

**యూరప్ ఆధిక్యతావాద సోషలిస్టు భావనలు:**

యూరపు ఆధిక్యతకు లోబడి యూరపులోని ఆధునిక సోషలిస్టు భావాలు 1789 ఫ్రెంచి విప్లవంలో మొగ్గతొడగనారంభించాయి. వేమన, పోతులూరి వీరబ్రహ్మంగారలు దీనికి ముందుగా వెనుకలుగా అంతర్ముఖమైన జాతి పరిమితుల్తో సోషలిజం భావాలను, వెనుకబడిన వ్యవస్థ పరిధుల్లో పరివ్యాప్తం చేశారు. యూరపులో 1797లో ఉరితీయబడిన బాబూఫ్ నిర్మించిన ఉద్యమాన్ని యూరపు వాళ్లు నవ్య సోషలిస్టు ఉద్యమంగా పేర్కొంటారు. క్యాబెట్ యికారియన్ కమ్యూనిస్టులు 1500 జనాభాతో ఒక కాలనీ నిర్మించి ఆదర్శ కమ్యూనిస్టు సమాజాన్ని సృష్టించడానికి ప్రయత్నించారు. ఇదొక బౌద్ధ సంఘం వంటిది. ఇది 47 సంవత్సరాలు బతికింది. నవ్యసమాజాన్ని ప్రజలను వాదబలంతో ఒప్పించి బహుజన సమ్మతి ద్వారా నిర్మించాలని, దౌర్జన్యంతో కాదని క్యాబెట్ కోరాడు. ఇతని భావాలు యిలా బౌద్ధానికి సమీపంగా ఉన్నాయి.

యూరపు సోషలిస్టు భావాల వ్యాప్తిలో గుడ్విన్ చార్లెస్ హాల్ వంటి బ్రిటిష్ రాడికల్స్ (1756-1836) రచనలు పెద్ద పరిణామం అంటారు. వర్గపోరాటం అనే భావాన్ని ప్రస్తుత అర్థంలో మొదటిసారిగా వ్యక్తం చేసింది చార్లెస్ హాల్. ఆయన భూమిని జాతీయం చేయాలన్నాడు. యుద్ధ కారణాల గురించి ఆయన ఇచ్చిన వివరణలు తర్వాతి సోషలిస్టులకు మార్గదర్శకం అయ్యాయి. వర్డ్సువర్తు, షెల్లీ వంటి కవులు కూడా వేమన వలె తమ ప్రక్రియల్లో సోసలిజాన్ని వ్యాప్తి చేసే కృషి చేశారు.

యూరోపియన్ సోషలిజం సిద్ధాంత వ్యాప్తిలో చెప్పుకొనదగిన తర్వాత పరిణామం నెపోలియన్ పాలనలోని ఫ్రాన్సులో వచ్చింది. సెయింట్ సైమన్ (1760-1825) నవ్య సమాజ స్థాపనకు శ్రామికవర్గాన్ని సాధనం చేసుకోవచ్చునని సూచించాడు. ఆస్తి సంబంధాల విషయంలో మార్క్సు రూపొందించిన సిద్ధాంతాన్ని ముందుగానే దర్శించి మార్క్సుకు దారి చూపాడు. చార్లెస్ ఫొరియర్ (1772-1837) సోషలిజాన్ని కోరుతూమన కులవృత్తుల స్వయంపోషక గ్రామీణ సమాజాన్ని పోలిన ఫలాన్‌స్తరీస్ (స్వయం పోషక సహకార గణాలు)ను ప్రతిపాదించాడు.

**బ్రిటీషు సోషలిజం:**

బ్రిటిష్ సోషలిజానికి రాబర్ట్ ఓవెన్ (1771-1857) పితామహు డంటారు. ఈయన హేతువాద ఉద్యమ పితామహుడు కూడా. 'కమ్యూనిజాన్ని' వాదంతో ప్రజలను ఒప్పించడం ద్వారా నింపాదిగా సాధించాలన్నాడు రాబర్ట్ ఓవెన్. ఈయన కూడా మన భారతీయ కుగ్రామాల వంటి గ్రామీణ సమాజాన్ని కమ్యూనిజం నమూనాగా ప్రతిపాదించాడు. ఒక గ్రామానికి 1500 ఎకరాల భూమి ఉండాలన్నాడు. అమెరికాలోని యిండియానాలో 30 వేల ఎకరాలు కొనుగోలు చేసి నవ సమ్మేళనం (న్యూ హార్మనీ) అనే కాలనీని స్థాపించి అతడనుకున్న కమ్యూనిజానికి ప్రతీకగా తీర్చిదిద్దాడు.

యూరపు సోషలిజం సిద్ధాంతం కూడా మొదట సామాజిక వర్గవాదంగానే పుట్టింది. అది ఆర్థికవాదంగా మలుపు తీసుకున్నది. యూరపు ఆర్థిక శాస్త్రవేత్తల సూత్రీకరణలు ఆధునిక సోషలిజానికి ఆధారాన్ని అందించాయి. అందించడంతో పాటు రాజకీయ, సామాజిక శాస్త్రం నుండి సోషలిజాన్ని ఆర్థిక శాస్త్రానికి కుదించబడినట్టయింది. సిస్మండీ (1773-1842) పెటీబూర్జువా (చిన్న తరహా) సోషలిజానికి తండ్రి అని మార్క్సుఉ కమ్యూనిస్టు మ్యానిఫెస్టోలో ప్రశంసించాడు. డేవిడ్ రికార్డో ఆర్థిక రచనలు సోషలిస్టు ఆర్థిక సిద్ధాంత అభివృద్ధికి తోడ్పడ్డాయి. అదనపు విలువ, శ్రమ విలువ సిద్ధాంతాలకు డేవిడ్ రికార్డో సైద్ధాంతిక ప్రాతిపదికలు చేశాడు. వీటి ఆధారంగానే లాభం అంతా పచ్చి దోపిడీ అని సోషలిస్టులు ఖండించడం వీలైంది.

హడ్స్కిన్ (1783-1869) రికార్డో సిద్ధాంతాలను ఆధారం చేసుకుని వస్తువు విలువకు ఏకైక సృష్టికర్త కార్మికుడే అని స్పష్టం చేశాడు. విలియం థాంసన్ కూడా సరుకు విలువ నిర్ణేత కార్మికుడే అని చెప్పాడు. జాన్‌బ్రే (1809-1895) అనే అమెరికన్ ఆర్థికవేత్త సూత్రీకరణలను కారల్‌మార్క్సు సరుకు విలువ దాని సిద్ధాంతం అదనపు విలువలో స్వీకరించి మరింత అభివృద్ధి పరిచాడు.

ఫ్రెంచి ఆర్థికవేత్తలైన ఆగస్ట్ బ్లాంకీ (1805-1881) లూయీ బ్లాంక్ (1811-1882)లు కొంచెం తేడాతో సోషలిజాన్ని ప్రతిపాదించారు. బ్లాంకీ తిరుగుబాటు నాయకుడు. అతనికి ఎన్నికల్లో విశ్వాసం లేదు. లూయీ బ్లాంక్ సార్వత్రిక వోటు హక్కుపై ఆధారపడిన రిప్రజెంటేటివ్ డెమోక్రసీని సమర్థించాడు. బహుజన సమ్మతి ద్వారా, వాదన ద్వారా గెలవడం వంటి వాటి ద్వారా విప్లవం రావాలన్నాడు.

యూరపు సోషలిస్టుల భావాల వ్యాప్తిలో జోసెఫ్ పియర్ ప్రొధాన్ (1806-1865) పాత్ర ఎంతో ముఖ్యమైనది. ఇతడు పేద రైతు కుటుంబంలో పుట్టి స్వయంకృషితో విద్యనార్జించాడు. ప్రొధాన్ 'ప్రభుత్వ' భావానికి వ్యతిరేకి. ఇది రాజ్యం రాలిపోవాలి అనే మార్క్సు ఆశయాన్ని కన్నది. రాజ్యం ఎలా అదృశ్యం అవుతుందో బుద్ధుడు రెండున్నర వేల ఏళ్ల క్రితం చెప్పాడు. రాజకీయాలంటే ప్రొధాన్‌కు ఏవగింపు. రాజకీయాలంటే దాష్టీకం, అధికార కేంద్రీకరణ, వ్యక్తి స్వేచ్ఛ నశించిపోవడం అని అన్నాడు. సోషలిస్టు రాజ్యాలు కూడా ప్రొధాన్ మాటనే నిర్ధారించాయి. కమ్యూనిస్టు, నక్సలైటు రాజకీయాలు కూడా ప్రొధాన్ అంచనానే నిర్ధారిస్తున్నాయి.

ఈ విధంగా యూరపు మేధావులు, నాయకులు, అభివృద్ధి పరిచిన సిద్ధాంతాల ఆధారంగా ఫేబియనిజం, మార్క్సిజం, గిల్డు సోషలిజం, ఫెమినిజం వగైరా సోషలిస్టు సిద్ధాంతాలు రూపొందాయి. ఎన్ని లోపాలున్నా వీరంతా యూరప్ తరహా సోషలిజం భావాలకు తల్లులు.

**అంబేద్కర్ అధ్యయన విశిష్టత:**

ఇవన్నీ తెలిసి వుండి కూడా బుద్ధుని కన్నా మార్క్సు అదనంగా చెప్పిందేమీ లేదన్నాడు అంబేద్కర్. అనగా బౌద్ధ సోషలిజం అంత గొప్పగా క్రాంతదర్శనం చేసిందని అర్థం. గతితర్కం విషయానికి వస్తే మన దేశంలో ఆచార్య నాగార్జునుని నాటికి సాధించిన అభివృద్ధి యూరపులో రావడానికి 1000 ఏళ్లు పట్టింది. కాంట్, హెగెల్, మార్క్సుల గతితర్కం, బుద్ధుడు, నాగార్జునుడు నాటికే మన దేశంలో అభివృద్ధి చెందింది. పెట్టుబబడిదారీ అర్థశాస్త్రం మనదేశంలో అభివృద్ధి చెందలేకపోయింది. కులవ్యవస్థ, బ్రాహ్మనిజం, వృధా వ్యయం చేసిన రాజులు ప్రజలు విదేశీ దండయాత్రలు, దోపిడీలు ఇక్కడ ఆర్థికాన్ని నాశనం చేశాయి. అందువల్ల పెట్టుబడిదారీ అర్థశాస్త్రం అభివృద్ధి చెందలేకపోయింది.

మహాత్మా జ్యోతిరావు పూలే, నారాయణ గురు, అంబేద్కర్, మావో, యం.యన్. రాయ్, రామమనోహర్ లోహియా వంటి వారితో ఆసియా సైద్ధాంతిక భావజాల రంగం సంపన్నమైంది. యూరపు, అమెరికా తదితర దేశాలు ఈ మాటను అంగీకరించడానికి సిద్ధంగా లేవు. అంబేద్కరిజాన్ని, యం.యన్. రాయ్‌నీ, లోహియానీ, ఫెమినిజాన్ని భారతీయ కమ్యూనిజంలో కలిపేసి ఉంటే తదనంతర ప్రపంచ సోషలిస్టు ఉద్యమాలకు సిద్ధాంత పునాదిని, నాయకత్వాన్ని భారతదేశం కూడా అందించి ఉండేది. భారతీయ కమ్యూనిజంలో చేరిన వర్ణవాదం దీన్ని అడ్డగించింది. అయినప్పటికీ దీన్ని సాధించాల్సే ఉంది. అందుకు చారిత్రక ప్రాతిపదికగా బౌద్ధ సోషలిజం ఎంతగానో ఉపకరిస్తుంది.

(తరువాయి భాగం వచ్చే సంచికలో)

## సదరు ఉద్యోగిపై దాడి చేసిన సాయినాథ్‌పై చర్యలు తీసుకోవాలి



మధిర జులై 14, ప్రజాపాలన ప్రతినిధి: మున్సిపాలిటీఉపాధిహామీ TA పై జరిగిన దాడికి నిరసననిర్మల్ జిల్లా కుబీరు మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్ గా పని చేస్తున్న రాజు గారి పై సాంబ్లి గ్రామ సర్పంచ్ సాయినాథ్ నిన్న సాయంత్రం పెట్రోల్ పోసి నిప్పుఅంటించి దాడి చేయటం జరిగింది. సదరు ఉద్యోగి పై దాడి చేసిన సాయినాథ్ పై కటిన చర్యలు తీసుకోవాలని సాంకేతిక సహాయకుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్ డిమాండ్ చేశారు. దాడికి నిరసనగా మధిర మండల పరిషత్ కార్యాలయంలో పనిస్తున్న ఉపాధిహామీ సిబ్బంది అందరూ నల్ల బ్యాడ్జ్ లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జానకి రామిరెడ్డి గారు, %జుజ% అరుంధతి గారు, లు అనిల్ కుమార్, ప్రసన్న కుమారి, నాగేశ్వరరావు, నాగేశ్వరరావు, శాంతయ్య, కంప్యూటర్ ఆపరేటర్లు గిరీష్, సుజాత మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## జ్వర సర్వే కార్యక్రమం

మధిర, జులై 14, ప్రజాపాలన ప్రతినిధి:మున్సిపాలిటీ7వ వార్డు లో ఫీవర్ సర్వే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కెసిఆర్ గారు మళ్ళీ జ్వరం సర్వే చేపట్టాలి నిర్ణయించిన నేపథ్యంలో ఖమ్మం జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు గారి ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్ పర్సన్ లత జయాకర్, మున్సిపల్ కమీషనర్ రమాదేవి గార్ల నేతృత్వంలో 7వ వార్డు కౌన్సిలర్ మేడికొండ కళ్యాణి కిరణ్ ఆధ్వర్యంలో జ్వరం సర్వే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. దీనిలో భాగంగా వార్డులో ప్రతి ఇంటికి వెళ్లి జ్వరం జలుబు దగ్గు లాంటి లక్షణాలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకోవడం జరిగింది ఈ సందర్భంగా కరోనా ఉధృతి ఇంకా వున్నది కావున ప్రతి ఒక్కరు మాస్క్ ధరించాలి అని చెప్పడం జరిగింది.దోమలు తిరిగే ప్రదేశాలలో దోమల మందు పిచికారీ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమం లో తెరాస నాయకులు మేడికొండ కిరణ్, మున్సిపల్ ఇంచార్జి వెంకట్, అంగన్వాడీ సిబ్బంది, మెప్మా సిబ్బంది, ఆశ వర్కర్స్ మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

**- వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్**



వికారాబాద్ జూలై 14 ప్రజా పాలన బ్యూరో :యువత స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ హితవు పలికారు. బుధవారం వికారాబాద్ మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామంలో స్వయం సహాయక సంఘం సభ్యులకు సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ఫ్) వారి ఆర్థిక సహాయంతో గ్రామీణ జీవనోపాదుల రుణాలతో మంజూరైన పాస్ట్ ఫుడ్ సెంటర్, టైలరింగ్ షాప్, బొలెరో, టిఫిన్ సెంటర్ మరియు సారీ సెంటర్ యూనిట్లను జిల్లా కలెక్టర్ పౌసుమి బసు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అతి ఎక్కువగా యువకులు కలిగిన దేశంగా భారతదేశం ఉందన్నారు. యువతలో స్కిల్ డెవలప్మెంట్ కోసం ప్రభుత్వం ప్రత్యేకమైన పథకాలను ప్రవేశ పెట్టిందని గుర్తు చేశారు. యువకులు తప్పనిసరిగా శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. యువకులందరూ స్వయం ఉపాధి దిశగా ఆలోచించాలన్నారు. ప్రభుత్వం వారి కోసం ప్రతేక రాయితీలు కల్పిస్తుందన్నారు. అనంతరం గ్రామంలోని పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించారు. దాతల ద్వారా డ్రిప్ సమకూర్చుకొని అడవి లాగా పెంచారని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పౌసుమి బసు, ఎంపీపీ చంద్రకళ, ఏఎంసి చైర్మన్ విజయ్ కుమార్, డిఆర్డిఏ పిడి కృష్ణన్, అదనపు పిడి నర్సింలు, ఎంపిడిఓ సుభాషిణి, ఎంపిఓ నాగరాజు, మండల పార్టీ అధ్యక్షులు కమాల్ రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి, రైతు బంధు అధ్యక్షులు వెంకటయ్య, జనరల్ సెక్రెటరీ సత్తయ్య గౌడ్, నారాయణపూర్ మాజీ సర్పంచ్ ఎర్రవల్లి సుభాన్ రెడ్డి, గ్రామస్థులు, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## మనస్థాపానికి గురైన ప్రియురాలు... ఆత్మహత్య ప్రయత్నం



బోనకల్,జులై 14, ప్రజాపాలన ప్రతినిధి:మండలంలోని చిరునోముల గ్రామంలో మంగళవారం రాత్రి తన ప్రియుడు పెళ్లికి ఒప్పుకోవడం లేదని మనస్తాపంతో ప్రియురాలు శానిటైజర్ తాగి ఆత్మాహత్యాయత్నం చేసింది. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన పారా సింధు రావినూతలకు చెందిన పర్సగాని వేణు నాలుగు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. తనను శారీరకంగా లొంగదీసుకొని పెళ్లి చేసుకోకుండా మొహం చాటేస్తున్నాడని స్థానిక పోలీస్ స్టేషన్‌లో పది రోజుల కిందట వేణుపై సింధు ఫిర్యాదు చేసింది.తనకు న్యాయం చేయాలని ఇప్పటికే రెండు సార్లు ప్రియుడి ఇంటి ఎదుట దీక్ష చేసింది. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది శానిటైజర్ తాగింది. అపస్మారక స్థితిలోకి వెళ్లిన సింధును కుటుంబ సభ్యులు రావినూతలలో ఉన్న ప్రియుడి ఇంటి ఎదుట వదిలేశారు. దళితురాలైనందున తనను పెళ్లి చేసుకునేందుకు ప్రియుడి తల్లిదండ్రులకు ఇష్టం లేదని అందుకు తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నానని, ఎవ్వరినీ వదిలిపెట్టవద్దని సూసైడ్ నోట్‌లో పేర్కొంది.

## హరితహారంలో భాగంగా ఏసీబీ కార్యాలయంలో మొక్కలు నాటిన డీజిపి పూర్ణచంద్రరావు



అమీర్ పేట్ జోన్(ప్రజాపాలన ప్రతినిధి) : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న హరితహారం కార్యక్రమం లో భాగంగా ఈ రోజు బంజారా హిల్స్ రోడ్ నెంబర్ 12 లోని యాంటీ కరప్షన్ బ్యూరో (ఏసీబీ) కార్యాలయంలో ఏసీబీ డీజీ పూర్ణచంద్రరావు తన మనవడు ఉద్ధవ్ కృష్ణ, ఎసిబి సిబ్బంది తో కలిసి మొక్కలు నాటారు... ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లుగా తమ కార్యాలయంలో హరితహారం దిగ్విజయంగా కొనసాగిస్తున్నామని తెలిపారు... ఇక్కడ నాటిన ప్రతి మొక్కను సజీవంగా ఉంచేందుకు తమ సిబ్బంది కృషి చేస్తునందుకు వారిని అభినందించారు.ఈకార్యక్రమంలో ఆయన తో పాటు ఏసీబీ సిబ్బంది పాల్గొన్నారు.

## పీర్జాదిగూడ కార్పొరేషన్లో ఆగస్టు1న బోనాల పండుగ



మేడిపల్లి, జూలై14 (ప్రజాపాలన ప్రతినిధి) :పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో బోనాల పండుగను ఆగష్టు1న జరుపుకోవాలని నిర్ణయించారు.ఈ మేరకు మేయర్ జక్క వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో పీర్జాదిగూడ మున్సిపల్ కౌన్సిల్ హాల్ నందు కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, పుర ప్రముఖులు, పట్టణ పెద్దలు, వివిధ పార్టీ నాయకులు మరియు ఆలయ నిర్వహకులతో సమావేశం నిర్వహించారు. పూజారులతో మాట్లాడి పెద్దలందరూ చర్చించి సమిష్టిగా ఆగస్ట్ 1వ తేదీన పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో అందరూ కోవిడ్ నిబంధనలు పాటిస్తూ బోనాల పండుగ నిర్వహించుకోవలని నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, కమీషనర్ ఎం.శ్రీనివాస్, మేడిపల్లి సిఐ అంజి రెడ్డి, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, పుర ప్రముఖులు, పట్టణ పెద్దలు, ఆలయ నిర్వాహకులు, పూజారులు తదితరులు పాల్గొన్నారు.

# నవరస నుండి థర్డ్ సింగిల్ విడుదల కి సిద్ధం!




మణిరత్నం క్రియేషన్ లో వస్తున్న నవరస వెబ్ సిరీస్ పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇప్పటికే నవరస వెబ్ సిరీస్ కి సంబందించిన పోస్టర్లు, వీడియోలు కొన్ని విడుదల అయ్యాయి. అయితే ప్రతి ఒక్క పోస్టర్ ఈ వెబ్ సిరీస్ పై మరింత ఆసక్తి రేపేలా ఉన్నాయి. అయితే ఈ వెబ్ సిరీస్ కి సంబందించిన మరొక క్రేజీ సాంగ్ విడుదల కి సిద్దం అవుతుంది. అయితే విజయ్ సేతుపతి, రేవతి, ప్రకాష్ రాజ్ లు ప్రధాన పాత్రల్లో బిజొయ్ నంబియార్ దర్శకత్వం వహించిన ఎపిసోడ్ ఎదిరి. ఎదిరి కరుణ రసం. అయితే ఈ ఎపిసొడ్ నుండి యాదో అంటూ నేడు సాయంత్రం విడుదల కి సిద్ధం అయింది. అయితే దీనికి గోవింద్ వసంత సంగీత అందించారు. థింక్ మ్యూజిక్ ద్వారా ఆడియో విడుదల కానుంది. అయితే నెట్ ఫ్లిక్స్ ద్వారా ఈ వెబ్ సిరీస్ ఆగస్ట్ 6 న విడుదల కానుంది. తమిళం లో మాత్రమే కాకుండా తెలుగు తో పాటు పలు భాషల్లో విడుదల కానుంది.

# విజిల్స్ ఖాయం.. దర్శకుడి వ్యాఖ్యలు వైరల్



సూపర్ స్టార్ మహేష్ బాబు సర్కారు వారి పాట షూటింగ్ మొదటి షెడ్యూల్ పూర్తి చేసుకున్న తర్వాత కరోనా సెకండ్ వేవ్ రావడంతో సెకండ్ షెడ్యూల్ ఆలస్యం అయ్యింది. ఎట్టకేలకు సర్కారు వారి పాట రెండవ షెడ్యూల్ ప్రారంభం అయ్యింది. షూటింగ్ కార్యక్రమాలు ఇటీవలే ప్రారంభం అయ్యాయి. హైదరాబాద్ లో షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా కీలక షెడ్యూల్ ను ఆగస్టు వరకు పూర్తి చేస్తారట. షూటింగ్ కు సెప్టెంబర్ వరకు గుమ్మడి కాయ కొట్టేయాలని దర్శకుడు పరశురామ్ ప్రయత్నాలు చేస్తున్నట్లుగా సమాచారం అందుతోంది. ఇటీవల దర్శకుడు పరశు రామ్ మీడియా ఇంట్రాక్షన్ లో సర్కారు వారి పాట సినిమా పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. మహేష్ బాబు అంటే తనకు చాలా అభిమానం. ఈ సినిమాను ఆయన అభిమానిగా చేస్తున్నట్లుగా చెప్పాడు. అభిమానులు మహేష్ ను ఎలా అయితే చూడాలని అనుకుంటున్నారో అలా నేను చూపించబోతున్నట్లుగా చెప్పిన దర్శకుడు సినిమాలోని కామెడీ కూడా సూపర్బ్ గా ఉంటుందని ఆయన అన్నాడు. మహేష్ బాబులోని కామెడీ యాంగిల్ ను ఈ సినిమాలో విభిన్నంగా చూపించడంతో పాటు రెగ్యులర్ కు భిన్నంగా కథనం ఉండేలా ప్లాన్ చేస్తున్నట్లుగా చెప్పుకొచ్చాడు. కామెడీ సన్నివేశాలు ఇంకా విజిల్ మూమెంట్స్ సినిమాలో చాలా ఉంటాయని.. మహేష్ బాబు సగటు అభిమానికి సర్కారు వారి పాట సినిమా ఫుల్ మీల్స్ అన్నట్లుగా ఉంటుందనే నమ్మకంను ఆయన వ్యక్తం చేశాడు. ప్రస్తుతం షూటింగ్ జరుపుతున్న సన్నివేశాల విషయంలో పూర్తి సంతృప్తిగా ఉన్నట్లుగా కూడా ఆయన చెప్పుకొచ్చాడు. మహేష్ బాబు మెడపై రూపాయి కాయిన్ టాటూ నుండి మొదలుకుని ఎన్నో ప్రత్యేకతలు ఆయన లుక్ లో ఉంటాయని అంటున్నారు. పరశురామ్ వ్యాఖ్యలతో సినిమా ఫస్ట్ లుక్ కోసం అభిమానులు వెయిట్ చేస్తున్నారు. భారీ అంచనాల నడుమ రూపొందుతున్న ఈ సినిమా ను వచ్చే సంక్రాంతికి విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నారు. షూటింగ్ ఆలస్యం అయినా కూడా సెప్టెంబర్ వరకు షూటింగ్ ను ముగించినట్లయితే సర్కారు వారి పాట ను సంక్రాంతికి తీసుకు రావడం పెద్ద సమస్య కాకపోవచ్చు అంటున్నారు. గత ఏడాది సంక్రాంతికి సరిలేరు నీకెవ్వరు సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన మహేష్ బాబు ఆ సినిమా తో భారీ విజయాన్ని సొంతం చేసుకున్నాడు. అలాగే ఈ సినిమా తో కూడా మరో విజయాన్ని సొంతం చేసుకుంటాడనే నమ్మకంను ఇండస్ట్రీ వర్గాల వారు వ్యక్తం చేస్తున్నారు. ఈ సినిమా లో మహేష్ బాబు కు జోడీగా కీర్తి సురేష్ హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెల్సిందే. ఈ సినిమాలో కీలక పాత్రనుయాక్షన్ కింగ్ అర్జున్ లేదా తమిళ స్టార్ నటుడు సముద్ర ఖని చేసే అవకాశాలు ఉన్నాయని సమాచారం అందుతోంది. సర్కారు వారి పాట తర్వాత మహేష్ బాబు చేయబోతున్న సినిమాకు త్రివిక్రమ్ దర్శకత్వం వహించబోతున్న విషయం తెల్సిందే. ఆ సినిమా సెప్టెంబర్ లేదా అక్టోబర్ లో పట్టాలెక్కే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాల వారి ద్వారా సమాచారం అందుతోంది. ఆ విషయమై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. త్రివిక్రమ్ తో ఖలేజా తర్వాత మహేష్ బాబు చేస్తున్న సినిమా అవ్వడం వల్ల అంచనాలు పీక్స్ లో ఉన్నాయి. ఆ తర్వాత రాజమౌళి దర్శకత్వంలో సినిమా ఉంటుందని అంటున్నారు. మొత్తానికి మహేష్ బాబు సినిమా ల లైనప్ ఓ రేంజ్ లో ఉండటంతో అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సర్కారు వారి పాట తో మొదలుకుని వరుసగా ఆయన సక్సెస్ లు సూపర్ హిట్ లు బ్లాక్ బస్టర్ లు దక్కించుకోవడం ఖాయం అంటూ అభిమానులు నమ్మకం వ్యక్తం చేస్తున్నారు.

# నేను ఓపెన్ బుక్ లా ఉన్నాను!:అమలా పాల్




నా వ్యక్తిగత జీవితాన్ని నా పని జీవితం నుండి వేరు చేసే పనిలో ఉన్నాను. అదే నేను ప్రాక్టీస్ చేస్తున్న కళ. నేను చాలా స్పృహతో ఓపెన్ బుక్ లా ఉన్నాను అని అన్నారు అమలాపాల్. 17ఏళ్ల వయసులో పరిశ్రమకు వచ్చిన పాల్ 12ఏళ్ల కెరీర్ ని దిగ్విజయంగా పూర్తి చేశారు. తన జీవితం తనకు చాలా నేర్పించిందని తాజా చిట్ చాట్ లో అన్నారు. అమలాపాల్ నటించిన కుడి ఎడమైతే వెబ్ సిరీస్ త్వరలో ఆహా ఓటీటీలో రిలీజ్ కి రానుంది. ఈ సందర్భంగా తన వ్యక్తిగత విషయాలపైనా అమలాపాల్ చాలా ఆసక్తికర విషయాలను వెల్లడించారు. దశాబ్దం పాటు సౌత్ లో కథానాయికగా ఓ వెలుగు వెలిగిన అమలాపాల్ ఇంతకు ముందు దర్శకుడు ఎఎల్ విజయ్ ను వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. కానీ కలతల వల్ల ఈ జంట విడిపోయారు. ప్రజలు తన వ్యక్తిగత జీవితంపై నిరంతరం ఆసక్తిని ప్రదర్శించడంపైనా అమలాపాల్ స్పందించారు. దానిని ఎలా ఎదుర్కోవాలో నేర్చుకున్నానని అన్నారు. నేను వెనక్కి తిరిగి చూసినప్పుడు దాని గురించి నాకు చెడుగా అనిపిస్తుంది. కానీ ఈ విషయాలపై నాకు నియంత్రణ లేదని అర్థం చేసుకునే జ్ఞానం కూడా నాకు ఉంది. ఇలాంటి వాటిపై నియంత్రణ లేకపోయినా.. జీవితంలో మనోహరంగా ముందుకు సాగగలను. ఇది కూడా ఈ ఉద్యోగంలో భాగమని నేను అర్థం చేసుకున్నాను. నాకు ఒక సామాజిక బాధ్యత ఉంది. సంఘంలో నేను మాత్రమే కాదు. చాలా ఉన్నాయి అని అమలాపాల్ తెలిపారు. నాకు లైఫ్ కి సంబంధించి ఇంతకుముందు తెలియని ఎంపిక ఉందని నేను గ్రహించాను. ఇప్పుడు నా వ్యక్తిగత జీవితాన్ని నా పని జీవితం నుండి వేరుచేసే పనిలో ఉన్నాను. అదే నేను ప్రాక్టీస్ చేస్తున్న కళ అని అమలాపాల్ అన్నారు. నేను ఎప్పుడూ అనుభవించక ముందు .. నా జీవితంలో ఏం జరుగుతుందనే దాని గురించి నేను చాలా ఓపెన్ గా ఉన్నాను. ఇప్పుడు నేను దానిని పంచుకునే ఆత్మను కావచ్చు..నా ఉద్దేశంపై నాకు క్లారిటీ ఉందని కూడా అమలాపాల్ తెలిపారు. ప్రతి ఒక్కరూ వారి జీవితంలోని వివిధ దశలలో వెళతారు. నేను దానిని ఎలా గ్రహించాలో వారు అర్థం చేసుకోగలరని నేను ఆశిస్తున్నాను. నేను నా జీవితంలో ఆ దశకు చేరుకున్నాను. అక్కడ నేను అంతగా ప్రతిదీ మీతో పంచుకోలేకపోతున్నాను అని చెప్పారు. కుడి ఎడమైతే సిరీస్ లో దుర్గా అనే పోలీస్ అధికారి పాత్రలో అమలాపాల్ నటించనున్నారు. మునుపటి కాలంలో మాదిరిగా తాను కఠినంగా ఉండటానికి వ్యతిరేకంగా తాను ఈ పాత్రను అప్రయత్నంగా పోషించానని అమలాపాల్ చెప్పారు. నా పాత్ర అతి ధోరణిని కలిగి ఉంటుంది. నా పాత్రలతో నేను చాలా ఎక్కువ ప్రయోగాలు చేస్తున్నాను. అప్రయత్నంగా ఎలా చేయగలనో అని దీని గురించి ఆలోచించాను ఆమె చెప్పింది. గత సంవత్సరం లాక్ డౌన్ సమయంలో చాలా ఆత్మపరిశీలన చేసుకున్నాను.. నాలోని కళాకారిణిని నేను అనుసరించాలని అనుకున్నాను. నాకు దుర్గా పాత్ర తెలుసు.. చాలా స్క్రిప్ట్ రీడింగ్ సెషన్లలో పాల్గొన్నాను. నాకు దుర్గ ఉద్యోగం.. ఆర్థిక పరిస్థితి గురించి తెలుసు అని తెలిపారు. ఇటీవల తన తండ్రిని కోల్పోయాక తన మానసిక స్థితి గురించి అమలాపాల్ ఈ ఇంటర్వ్యూలో వెల్లడించారు.



# 'రాక్షసుడు 2' లో నటించే స్టార్ హీరో అతనేనా..?

తమిళంలో సూపర్ హిట్ అయిన 'రాక్షసన్' చిత్రాన్ని తెలుగులో "రాక్షసుడు" పేరుతో రీమేక్ చేసిన సంగతి తెలిసిందే. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా రమేష్ వర్మ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందింది. కోనేరు సత్యనారాయణ నిర్మించిన ఈ చిత్రం తెలుగులో కూడా ఘన విజయం సాధించింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు దర్శకుడు సొంతగా కథ రెడీ చేసుకొని 'రాక్షసుడు' చిత్రానికి సీక్వెల్ చేయాలని సంకల్పించారు. "రాక్షసుడు 2" చిత్రానికి సంబంధించిన అనౌన్స్ మెంట్ పోస్టర్ ని విడుదల చేసి 'హోల్డ్ యువర్ బ్రీత్' అంటూ ఆసక్తిని కలిగించారు. అయితే ఈ సినిమాలో నటించబోయే హీరో ఎవరనేది ప్రకటించలేదు.'రాక్షసుడు 2' చిత్రంలో ఓ స్టార్ హీరో నటించబోతున్నాడని మేకర్స్ ప్రకటించారు. దీంతో ఈ సినిమాలో నటించే ఆ స్టార్ హీరో గురించి సోషల్ మీడియాలో అనేక వార్తలు వస్తున్నాయి. అయితే మేకర్స్ చెప్పిన ఈ ప్రముఖ హీరో టాలీవుడ్ కు చెందిన వ్యక్తి కాదంట. తమిళం నుంచి దిగుమతి చేసుకోబోతున్నారట. దీని కోసం మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి – శివ కార్తికేయన్ వంటి హీరోల పేర్లను పరిశీలించిన మేకర్స్.. సేతుపతి వైపే మొగ్గు చూపారని టాక్ వినిపిస్తోంది. నేషనల్ అవార్డ్ విన్నింగ్ యాక్టర్ విజయ్ సేతుపతి కి ఇప్పుడు భాషతో సంబంధం లేకుండా దేశవ్యాప్తంగా మంచి ఫాలోయింగ్ ఉంది. 'పిజ్జా' 'పేట' వంటి డబ్బింగ్ సినిమాలతో తెలుగు ప్రేక్షకులను పలకరించిన విజయ్ సేతుపతి.. 'సైరా నరసింహా రెడ్డి' సినిమాలో చిన్న పాత్రలో కనిపించాడు. ఈ క్రమంలో 'ఉప్పెన' చిత్రంలో ప్రతినాయకుడిగా నటించి మెప్పించారు. ఈ నేపథ్యంలో "రాక్షసుడు 2" చిత్రాన్ని తెలుగు తమిళ బైలింగ్విల్ గా రూపొందించాలని ప్లాన్ చేసిన మేకర్స్.. సేతుపతి ని లీడ్ రోల్ కోసం సంప్రదించారట. రమేష్ వర్మ చెప్పిన కథ నచ్చడంతో.. వర్సటైల్ యాక్టర్ పాజిటివ్ సిగ్నల్ ఇచ్చారని టాక్ నడుస్తోంది. ప్రస్తుతం విజయ్ సేతుపతి వరుస ప్రాజెక్ట్స్ తో ఏడాది పొడవునా బిజీ షెడ్యూల్స్ ప్లాన్ చేసుకున్నారు. డేట్స్ అడ్జస్ట్ చేయలేక పలు పాన్ ఇండియా చిత్రాలను ఆయన వదులుకోవాల్సి వచ్చింది. మరి ఇప్పుడు 'రాక్షసుడు 2' కోసం సేతుపతి డేట్స్ అడ్జస్ట్ మెంట్ చేసుకొని గ్రీన్ సిగ్నల్ ఇస్తారేమో చూడాలి. ఒకవేళ విజయ్ సేతుపతి 'రాక్షసుడు' సీక్వెల్ లో భాగం అయితే మాత్రం.. ఇది క్రేజీ ప్రాజెక్ట్ అవుతుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. రమేష్ వర్మ ప్రస్తుతం మాస్ మహారాజ రవితేజ తో 'ఖిలాడి' సినిమా పనుల్లో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తైన తర్వాత "రాక్షసుడు 2" సినిమా ప్రారంభం కానుంది. 'రాక్షసుడు' చిత్రం కోసం పని చేసిన సాంకేతిక బృందం మొత్తం 'రాక్షసుడు 2' లో భాగం అవుతున్నారు. ఎ స్టూడియోస్ సమర్పణలో హవిష్ ప్రొడక్షన్ బ్యానర్ పై సత్యనారాయణ కోనేరు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గిబ్రాన్ సంగీతం సమకూరుస్తున్న ఈ చిత్రానికి వెంకట్ సి దిలీప్ సినిమాటోగ్రఫీ అందించనున్నారు. రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ తమ్ముడు సాగర్ మరియు శ్రీకాంత్ విస్సా కలిసి ఈ చిత్రానికి సంభాషణలు రాస్తున్నారు. ఫైట్ మాస్టర్స్ రామ్ – లక్ష్మణ్ యాక్షన్ కొరియోగ్రఫీ చేయనున్నారు. దర్శకుడు రమేష్ వర్మ ఈ చిత్రానికి కథ – స్క్రీన్ ప్లే అందిస్తున్నారు. ఈ సినిమా ఎలాంటి సంచనాలు క్రియేట్ చేయబోతుందో చూడాలి.



Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989